

ప్రతి వ్యక్తి జీవితంలో తల్లిదండ్రుల తరువాత గురువులే ప్రధాన పాత్రను పోషిస్తారు. వారికి మంచి చెడులు చెబుతూ తీర్చిదిద్దుతారు. అజ్ఞానాన్ని తొలగించి విజ్ఞానాన్ని పంచుతారు. కొన్నిసార్లు తిట్టి, కొట్టి పాఠాలు బోధించి ప్రయోజకులను చేస్తుంటారు. జిల్లాలోని ఎందరో ఉపాధ్యాయులు తన జీవితాన్ని విద్యార్థులకు అంకితం చేశారు. కాలినడకన, సైకిళ్లపైనే పదుల కిలోమీటర్ల దూరంలోని పాఠశాలలకు వెళ్లి బోధించేవారు. భావిభారత పౌరులను తయారు చేయాలన్న సంకల్పంతో పనిచేసేవారు. వారి వద్ద ఓనమాలు నేర్చుకున్న విద్యార్థుల్లో నేడు ఎందరో ఉన్నత స్థాయిలో ఉన్నారు. నేడు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కొందరు రిటైర్డ్ ఉపాధ్యాయులు తమ మనోగతాన్ని 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

అజ్ఞానాన్ని తొలగించి.. విజ్ఞానాన్ని పంచి

నేడు ఉపాధ్యాయ దినోత్సవం

- అ'విశ్రాంత'ంగా సేవలు అందించిన ఉపాధ్యాయులు
- కాలినడకన, సైకిళ్లపైనే విధులకు
- ఎందరో విద్యార్థులను ప్రయోజకులను చేసిన వైనం



దాసు మాస్టరు స్కూల్..



పొందూరు: మండల కేంద్రానికి చెందిన వాంగ్రంగి కృష్ణదాసు (దాసు మాస్టరు) పొందూరు ఎంపీపీ-2 పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేశారు. ఈయన జి.సిగడాం మండలం వాంగ్రంగిలో నివాసం ఉండేవారు. ప్రతిరోజూ సుమారు 5 కి.మీ రోజూ నడుచుకుంటూ పాఠశాలకు చేరుకునేవారు. పాఠశాలను ఎంతో నిబద్ధతతో తీర్చిదిద్దారు. అందుకే ఇప్పటికీ పొందూరు ఎంపీపీ-2 పాఠశాలను దాసు మాస్టరు స్కూల్‌గానే అందరూ పిలుస్తుంటారు. ఈయన వద్ద చదివిన ఎందరో విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకున్నారు. జిల్లా విద్యాశాఖాధికారిగా పనిచేసిన బలివాడ మల్లేశ్వరరావు, స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండి యా జనరల్‌మేనేజర్‌గా పనిచేసిన వి. మధుసూదనరావు ఈయన శిష్యులే. దాస్ మాస్టర్‌కు ఐదుగురు కుమారులు. ఒక కుమార్తె ఉన్నారు. వీరిలో ముగ్గురు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. కుమార్తె, అల్లుడు కూడా ఉపాధ్యాయులే. విద్యారంగానికి చేసిన సేవలకు గాను దాసు మాస్టరుకు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వరించింది.

15 కిలోమీటర్లు సైకిల్‌పైనే..



సరుబుజ్జిలి: మండలం కొండవలస గ్రామానికి చెందిన ఎల్వీ భాస్కరరావు(85) 1974లో ఎల్ఎన్‌పేట మండలం బొరమాంబపురం పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరారు. ఆ తరువాత ఆమదాలవలస సమితి పరిధిలో ఉన్న వెన్నెలవలస గిరిజన గ్రామంలో ఉపాధ్యాయుడిగా చేరారు. 'అప్పటి ప్రభుత్వం కొత్తగా ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేసింది. మొదటిసారి గిరిజన ప్రాంతంలో పనిచేయడానికి ఉపాధ్యాయులు ఎవరూ ముందుకురాని సమయంలో నన్ను వెన్నెలవలస ఉపాధ్యాయుడిగా విద్యాశాఖ నియమించింది. ఎటువంటి వాహనాలు లేవు. నా స్వగ్రామం కొండవలస నుంచి ప్రతిరోజూ సుమారు 15 కిలోమీటర్లు సైకిల్‌పై వెళ్లేవాడిని. గిరిజనులకు అవగాహన కల్పించి చదువుపై ఇష్టత చూపించాను. కొంతమంది గిరిజన విద్యార్థులు ఆర్థిక ఇబ్బందు లతో పలకలు కొనలేని పరిస్థితి ఉండేది. ఆ విద్యార్థులకు ఇసుకలో అక్షరాలు రాసి చేతివేళ్లతో దిద్దించేవాడినని' భాస్కరరావు తెలిపారు. 2010లో సరుబుజ్జిలి మండలం సుభద్రాపురం పాఠశాలలో ఆయన పదవీ విరమణ చేశారు.

ప్రమోషన్ వచ్చినా వెళ్లకుండా..



కొత్తూరు: కర్లెమ్మ గ్రామానికి చెందిన ఎద్దు గోపాలదాసునాయుడు(86) 1960లో బత్తిలి పాఠశాలలో ఉపాధ్యాయునిగా జీవిత ప్రస్థానం మొదలు పెట్టారు. అనంతరం కొరసవాడ, విజయనగరం జిల్లా రేజేరు, తులగాం గ్రామాల్లో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేశారు. పని చేసిన ప్రతిచోటా పాఠశాలలకు సొంత స్థలాలు, ఆటస్థలాలు దాతల సహకారంతో సమకూర్చారు. 1970లో అప్పటి అధికారులు, ప్రజా ప్రతినిధులను కలిసి కొత్తూరుకు జూనియర్ కళాశాలను మంజూరు చేయించారు. 1998లో జిల్లా పరిషత్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్‌గా ప్రమోషన్ వచ్చినా వెళ్లలేదు. 1998లో నివగాం ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పదవీ విరమణ చేశారు. అనంతరం తన తల్లిదండ్రుల పేరుపై సుందర నారాయణనాయుడు, వరహాలమ్మ చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేసి ప్రతీ ఏడాది ఉత్తమ మార్కులు పొందిన ప్రభుత్వ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, పుస్తకాలు, దుస్తులు అందిస్తున్నారు. వ ప్రదానాలు చేస్తున్నారు. ఈయన వద్ద విద్య నేర్చుకున్న వారిలో ఐపీఎస్ రత్నం, హైకోర్టు జడ్జి రెడ్డి కాంతారావు, ఆర్‌ఐవో గోవిందరావు, వాషింగ్టన్ యూనివర్సిటీ కంప్యూర్ సైన్స్ ప్రొఫెసర్ చెల్లి నారాయరావు, నేషనల్ అవార్డు గ్రహీత మణిపాత్రుడు నాగేశ్వరరావు వంటివారు ఉన్నారు.

గిరిజన గూడల్లో అక్షర బ్రహ్మ..

టెక్కలి: టెక్కలికి చెందిన వల్లభ మల్లయ్య గిరిజన గూడలకు అక్షర బ్రహ్మగా మారారు. ఈయన ఎన్నో గిరిజన పాఠశాలల్లో ఉపాధ్యాయునిగా పని చేసి రిటైర్డ్ అయ్యారు. గిరిజనుల్లో మూఢ నమ్మకాలను పారదోలడం, వారు చదువుకునేలా చైతన్యపరచడం, గిరిజన విద్యార్థుల చదువుకు ఆర్థికంగా ప్రోత్సహించడంలో మల్లయ్య మేటిగా నిలిచారు. ఆయన సేవలను గుర్తించి 2002లో జయప్రకాష్ నారాయణ్, ఐఐటీ రామయ్య, ప్రొఫెసర్ గంటా రమేష్, ప్రొఫెసర్ అనపోలు సత్యనారాయణ తదితరులు క్లాస్‌మీట్ అవార్డుతో సత్కరించారు. 2003లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అప్పటి సీఎం చంద్రబాబు చేతుల మీదుగా అందుకున్నారు. 2006లో అప్పటి రాష్ట్రపతి అబ్దుల్‌కలాం నుంచి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును పొందారు. 2016లో ఐటీడీఏ డిప్యూటీ డీఈవోగా జాతీయస్థాయి అవార్డును నాటి కేంద్ర మంత్రి స్మృతిఇరానీ నుంచి అందుకున్నారు. గిరిజనంలో మనసున్న మారాజుగా మల్లయ్య పేరు సంపాదించారు.



రాష్ట్రపతి అబ్దుల్‌కలాం నుంచి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకుంటున్న వల్లభ మల్లయ్య (ఫైల్)

7 కిలోమీటర్లు నడుచుకుంటూ పాఠశాలకు..



ఆమదాలవలస: మండలంలోని కనుగులవలస గ్రామానికి చెందిన బొడ్డేపల్లి మోహన్‌రావు 1977లో ఉపాధ్యాయ పోస్టుకు ఎంపికయ్యారు. విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం వెంకన్నగారిపాలెంలో మొదటిసారి ఉపాధ్యాయ వృత్తిని చేపట్టారు. ఆ గ్రామంలోని పూరిపాకలో నిర్వహిస్తున్న పాఠశాలలో ఏకో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించారు. ప్రతిరోజూ సుమారు ఏడు కిలోమీటర్లు దూరం కాలినడకన పాఠశాలకు వెళ్లి విధులు నిర్వహించేవారు. 2008లో రాగోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవీ విరమణ చేశారు. అనంతరం తనకు ఎంతో ఇష్టమైన ఎల్ఎల్‌బీ పూర్తి చేసి ఆమదాలవలస సివిల్ జడ్జి కోర్టులో న్యాయ వాదిగా చేరారు. నిరుపేద కక్షిదారులకు న్యాయసేవలు అందించడమే కాకుండా సమాజంలో నెలకొన్న వివిధ సామాజిక అసమానతలను ఎత్తుచూపుతూ కోర్టులో ప్రజా వాద్యాలు వేసి సమస్యల పరిష్కారానికి మోహన్‌రావు కృషి చేస్తున్నారు.



సరస్వతి విగ్రహం వద్ద గురుశిష్యులు శంకరరావు, విశ్వనాథం..

సైకిల్‌పైనే పాఠశాలకు..




కంచిలి: మండలంలోని డీజీపురం గ్రామానికి చెందిన తారక్ నాయక్ (84) ఉపాధ్యాయుడిగా పనిచేసి రిటైర్డ్ అయ్యారు. ఆయన 1966 లో ఉపాధ్యాయుడిగా అదే గ్రామంలోని పాఠశాలలో చేరారు. అక్కడ కొన్ని సంవత్సరాలు పనిచేశాక మూడు కిలో మీటర్ల దూరంలోని సాగర నౌగాం పాఠశాలకు బదిలీ అయింది. అక్కడ ఒక ఏడాది పని చేశారు. తరువాత నాలుగు కిలో మీటర్లు దూరంలోని ఎంఎస్‌పల్లి, ఐదు కిలో మీటర్ల దూరంలోని ఎక్కల పాఠశాలల్లో పని చేశారు. తన సర్వీసు కాలమంతా పాఠశాలలకు సైకిల్‌పైనే వెళ్లేవారు. పూర్తిస్థాయిలో రహదారులు లేని ఆ రోజుల్లో పాఠశాలలకు నడిచి వెళ్లిన సందర్భాలు ఉన్నాయని ఆయన తెలిపారు.

శిష్యుడు హెచ్‌ఎం.. గురువు ఉపాధ్యాయుడు

ఇచ్ఛాపురం: మండలంలోని ధర్మపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో శంకరరావు అనే ఉపాధ్యాయుడు పనిచేస్తున్నాడు. ఈయన సోషల్ సబ్జెక్ట్ బోధిస్తున్నారు. అదే పాఠశాలకు హెచ్‌ఎంగా విశ్వనాథం ఉన్నారు. ఈయన గణితం బోధిస్తుంటారు. అయితే, శంకరరావు వద్ద చదువుకున్న విశ్వనాథం తన గురువు పనిచేస్తున్న పాఠశాలకే హెచ్‌ఎం అయ్యారు. 1983లో ఎస్జీటీ పోస్టుతో ఉపాధ్యాయుడిగా మారారు శంకరరావు. ప్రస్తుతం స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందారు. కొద్దిరోజుల్లో పదవీవిరమణ చేయనున్నారు. విశ్వనాథం 2000 డీఎస్సీలో భాగంగా స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు. పదోన్నతుల్లో భాగంగా హెచ్‌ఎం అయ్యారు. తన శిష్యుడు హెచ్‌ఎంగా ఉన్న చోట పనిచేయడం సంతృప్తినిస్తోందని శంకరరావు చెబుతున్నారు. తన గురువు వద్ద హెచ్‌ఎంగా ఉండడం ఆనందంగా ఉందని విశ్వనాథం అంటున్నారు.

24 కిలో మీటర్లు నడిచేవాడిని..



జలుమూరు: 'నేను అల్లాడ ఉన్నత పాఠశాలలో గ్రేడు-1 తెలుగు పండిట్‌గా పనిచేశాను. ప్రతిరోజూ పాఠశాలకు వెళ్లి వచ్చేందుకు 24 కి.మీ నడిచేవాడిని. సమయానికి పది నిమిషాలు ముందే పాఠశాలకు చేరుకొనివాడిని. గతంలో విద్యపై రాజకీయ ప్రమేయం, ప్రభుత్వ పాలసీలు ఉండేవి కావు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన గుణాత్మకమైన విద్యను అందించడమే లక్ష్యంగా పనిచేసేవాళ్లం. ప్రస్తుతం విద్యపై రాజకీయ ప్రమేయం పెరిగి ప్రభుత్వ పాలసీలలను రుద్దడంతో ఉపాధ్యాయుల్లో నిబద్ధత తగ్గి పిల్లలకు సరైన క్రమశిక్షణతో కూడిన విద్యను అందించలేక పోతున్నారు. నా దగ్గర చదువుకున్న తాళ్లవలస గ్రామానికి చెందిన బెండి రాజగోపాలరావు రాష్ట్ర గృహనిర్మాణశాఖ సీఈగా పని చేశారు.' అని దాలప్పపేట గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎంఈవో పేడాడ తులసీరావు (82) తెలిపారు.



రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ నుంచి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న డీఏ స్టాలిన్ (ఫైల్)

బొమ్మలతో బోధించడంలో మేటి..

టెక్కలి: టెక్కలికి చెందిన రిటైర్డ్ టీచర్ డీఏ స్టాలిన్ బొమ్మలాటలతో పాఠ్యాంశాలను బోధించడంలో మేటి. ఈయన టెక్కలి మండల పరిధిలోని పలు పాఠశాలల్లో పని చేశారు. విద్యార్థులకు ఆటపాటలతో బోధించేవారు. ప్రజాచైతన్య కళాసమితితో కలసి నిరంతర సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య శిబిరాలు, చనిపోయిన వారి నుంచి నేత్రాలను సేకరించి మరొకరికి చూపునివ్వడం.. ఇలాంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. 2006లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపా ధ్యాయ అవార్డు, 2008లో అప్పటి రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ నుంచి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు.

పదవీ విరమణ చేసి.. సంగీత కళాశాలను స్థాపించి..

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురానికి చెందిన దుక్కి శ్యామ్‌దాస్, దుక్కి దేవేందర్ దాస్ అన్నదమ్ములు. 20 ఏళ్లకే ఉపాధ్యాయ ఉద్యోగంలో చేరారు. ఇచ్ఛాపురం మండలంలోని పలు ఒరియా పాఠశాలల్లో పనిచేశారు. ఒరియా ఉపాధ్యాయులు అంటే చటుక్కున ఈ ఇద్దరే గుర్తుకొస్తారు. శ్యామ్‌దాస్ ఇచ్ఛాపురం నుంచి జాడుపూడి వరకు బస్సులో వెళ్లి అక్కడ నుంచి సుమారుగా 5కిలోమీటర్లు కాలినడకన పాఠశాలకు వెళ్లేవారు. తరువాత కొంత కాలానికి ఇచ్ఛాపురం నుంచి సుమారుగా 12 కి.మీ సైకిల్‌లోనే వెళ్లి విద్యార్థులకు పాఠాలు బోధించేవారు. దేవేందర్ దాస్ మాత్రం ఇచ్ఛాపురం పట్టణ పరిధిలోనే పని చేశారు. 2008లో శ్యామ్‌దాస్, 2009లో దేవేందర్ దాస్ పదవీ విరమణ చేశారు. అయితే వీరికి చిన్నప్పటి నుంచి సంగీతం అంటే మక్కువ. శ్యామ్‌దాస్ వీణ, వయోలిన్ వాయించడంలో సిద్ధహస్తులు. దేవేందర్ దాస్ హార్మోనియం, తబలా, మృదంగం వాయిస్తూ బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు తెచ్చుకున్నారు. అందుకే పదవీ విరమణ తరువాత సంగీత కళాశాలను స్థాపించారు. 78ఏళ్ల వయసులోనూ కూడా సంగీత పాఠాలు బోధిస్తూ అందరీ మన్ననలు పొందుతున్నారు.



శ్యామ్‌దాస్, దేవేందర్ దాస్...

నా మొదటి జీతం రూ.90..



టెక్కలి: మండలంలోని గూడేం గ్రామానికి చెందిన గుజ్జు వెంకటరెడ్డి 1960లో నర్సింగపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరారు. 'ఈ పాఠశాలకు మా గ్రామం నుంచి వెళ్లేందుకు రవాణా సౌకర్యాలు అంతగా లేవు. కొన్నాళ్ల పాటు కాలినడకన వెళ్లి పిల్లలకు పాఠాలు చెప్పేవాడిని. నా మొదటి నెల జీతం 90 రూపాయలు. నేను రిటైర్డ్ అయిన తరువాత ప్రస్తుతం నెలకు రూ.45 వేలు జీతభత్యాలు అందుకుంటున్నా. ఎవరైనా పిల్లలు పాఠశాలకు రాకపోతే వారి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు నచ్చజెప్పి తిరిగి బడికి వచ్చేటట్లు చేసేవాళ్లం. నాడు పిల్లల్లో ఉన్న గుణాత్మక విద్య నేటి పిల్లల్లో లోపించిందని' వెంకటరెడ్డి తెలిపారు.

ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ ఆధ్వర్యంలో బుజ్జాయిల చేతుల్లో బొజ్జ గణపయ్య

- 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ఆహ్వానం
- రేపు ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో కార్యక్రమం నిర్వహణ
- ప్రవేశం ఉచితం
- పర్యావరణహిత మట్టి విగ్రహాల తయారీ లక్ష్యం



అరసవల్లి, సెప్టెంబరు 4: వినాయక చవితి పండగను పర్యావరణ హితంగా జరుపుకొనేలా, భావి తరాలకు మార్గనిర్దేశం చేసేలా పిల్లలను భాగస్వాములను చేస్తూ ప్రతీ ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ బుజ్జాయిల చేతుల్లో బొజ్జ గణపయ్య కార్యక్రమం నిర్వహించేందుకు శ్రీకారం చుట్టింది. మట్టి వినాయక ప్రతిమల తయారీలో పిల్లలకు శిక్షణ ఇస్తూ, వాటిని తయారు చేసేందుకు 8, 9, 10వ తరగతి విద్యార్థులకు ఈ నెల 6వ తేదీన పోటీలు నిర్వహించనుంది. నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో ఈ కార్యక్రమం జరగనుంది. ప్లాస్టర్ ఆఫ్ పారీస్‌తో రూపొందించిన విగ్రహాలకు రసాయనిక రంగులు వేయడంతో అవి కాలుష్యానికి కారణమవుతున్నాయి. అందుకే వినాయక చవితిని పర్యావరణ హితంగా, ఆనందంగా జరుపుకోవడమే లక్ష్యంగా ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ బుజ్జాయిల చేతుల్లో బొజ్జ గణపయ్య కార్యక్రమాన్ని ప్రతిఏటా నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు విద్యార్థులకు ఎటువంటి ప్రవేశ రుసుం లేదు. విగ్రహాలను విద్యార్థులే బంకమట్టితో తయారు చేయడానికి శిక్షణ ఇస్తారు. చక్కగా ప్రతిమలను తయారు చేసిన వారికి బహుమతులను అందజేస్తారు. ఇందులో పాల్గొనాల్సిన విద్యార్థులు పాత బాటిల్‌తో నీరు, పాత వస్త్రం మాత్రమే వారి వెంట తెచ్చుకోవాలి. ఆసక్తి గల వారు రిజస్ట్రేషన్ కోసం 99854 11066 నెంబరును సంప్రదించాలి. ఈ కార్యక్రమానికి ప్రధాన స్పాన్సరర్‌గా గార మండలం చిన అంబటివానిపేటకు చెందిన పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రముఖ వ్యాపారవేత్త అంబటి కృష్ణారావు వ్యవహరిస్తున్నారు.

కిడ్నీ ప్రభావిత గ్రామాల్లో పరిశోధనలు

- ఉద్దానంలో పర్యటించిన కొలంబియా యూనివర్సిటీ శాస్త్రవేత్త
- మట్టి, నీరు, ధూళి శాంపిళ్ల సేకరణ

పలాస, సెప్టెంబరు 4: కిడ్నీ ప్రభావిత గ్రామాల్లో గ్లోబల్ ఇనిస్టిట్యూట్ వైద్యబృందం ఆధ్వర్యంలో పరిశోధనలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు ఈ పరిశోధనలు కొనసాగుతాయి. పలాస, వజ్రపుకొత్తూరు, మందస, సోంపేట, కవిటి, ఇచ్ఛాపురం, కంచిలి మండలాల్లోని కిడ్నీ ప్రభావిత గ్రామాల్లో ఈ పరిశోధనలు జరగనున్నాయి. వీరికి గైడ్‌గా కొలంబియా యూనివర్సిటీ పర్యావరణ శాస్త్రవేత్త లెక్స్‌వెన్‌గేన్ వ్యవహరిస్తున్నారు. రెండు రోజుల పాటు సిబ్బందికి కిట్లు వినియోగంపై శిక్షణ ఇచ్చిన అనంతరం గ్రామాల్లో వారికి ప్రయోగాత్మకంగా పరిశీలించేందుకు తీసుకెళ్లారు. ముందుగా ఈ బృంద సభ్యులు కిడ్నీ బాధితులతో మాట్లాడారు. వారి నుంచి వివరాలు తీసుకున్నారు. అనంతరం మట్టి, నీరు, ధూళి సేకరించి ప్రయోగశాలలకు తరలించారు. పలాసలోని కిడ్నీ పరిశో ధన కేంద్రంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పరికరాలతో పరిశోధనలు చేశారు. అదే విధంగా కిడ్నీ వ్యాధిగ్రస్తుల నుంచి యూరిన్, రక్తనమూనాలు సేకరించారు. వాటిలో ఎంత మేరకు వ్యాధి కారకాలు ఉన్నాయో గుర్తించి వాటిపై పరిశోధించనున్నారు. ఈ పరిశోధనలకు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ ఇప్పటికే నిధులు సమకూర్చిన విషయం విధితమే. మొత్తం ఐదు అంశాలపై ఈ పరిశోధన జరుగుతుందని గ్లోబల్ ఇనిస్టిట్యూట్ వైద్యాధికారి డాక్టర్ జి.బాలాజి విలేకరులకు తెలిపారు. తొలుత పలాస మండలంలో ఈ పరీక్షలు నిర్వహించామన్నారు. అమెరికా నుంచి దిగుమతి అయిన 120 పరీక్ష కిట్లను మొదటగా వినియోగిస్తున్నామని తెలిపారు.



ఓ మహిళ నుంచి వివరాలు తెలుసుకుంటున్న పరిశోధకులు లెక్స్‌వెన్‌గేన్, గ్లోబల్ సంస్థ నిర్వాహకులు

పకడ్బందీగా ఎరువుల పంపిణీ

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


కలెక్టరేట్ సెప్టెంబరు 4: జిల్లాలో ఎరువుల పంపిణీ పకడ్బందీగా జరుగుతుందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్ లక్ష్యం 61,262 టన్నులు కాగా, లక్ష్యానికి మించి ఇప్పటి వరకు 65,007 టన్నులు పంపిణీ చేసినట్లు తెలిపారు. తన కార్యాలయంలో ఆయన బుధవారం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత జడ్పీ సర్వసభ్య సమావే శంలో సభ్యులు అడిగిన అన్ని ప్రశ్నలకు పరిష్కారం చూపి లిఖితపూర్వక సమాధానాలు ఇవ్వాలని ఆదేశించారు. భవిష్యత్తు అవసరాలకు సంబంధించి జిల్లా కేంద్రం నుంచి మండల కేంద్రాలు, గ్రామాలకు అవసరమైన ఎరువులను ముందస్తుగా నిల్వ చేయాలని ఆదేశించారు. జిల్లా, మండల, డివిజన్ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలన్నారు. డీలర్లు ఎరువులను బ్లాక్ చేస్తే వారి లైసెన్సు రద్దు చేయాలన్నారు. సీఆర్‌జడ్ నిబంధనలకు లోబడి తీరప్రాంత గ్రామాల్లో భూముల రిజిస్ట్రేషన్లు జరగాలని ఆదేశించారు. బీఆర్ వంశధార ప్రాజెక్టు, నీటిపారుదల శాఖల్లో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కార మార్గా లను సూచించాలన్నారు. ఈ విషయంలో ఉదాసీనంగా ఉంటే, ఆయా అధికారులపై చర్యలు తప్పవని హెచ్చ రించారు. పనులు పూర్తి చేయడానికి ముందుకు రాని కాంట్రాక్టర్లను తొలగించాలన్నారు. ఉపాధిహామీ జాబ్ కార్డుల మంజూరులో సరళంగా వ్యవహరించాలని, ఆశా వర్కర్లు జాబ్ చార్ట్ ఆధారంగా పనిచేసేలా పర్యవేక్షించాలని తెలిపారు. నిబంధనల కారణంగా కరువు మండ లాలుగా ప్రకటించే అవకాశం లేని మండలాలకు పంటల బీమాను వర్తింపచేయాలని ప్రభుత్వానికి నివేదించామన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో అప్పారావు, జడ్పీ సీఈవో వేంకటేశ్వర రావు, డీసీవో నగేష్, డీఎంహెచ్‌వో మీనాక్షి, జిల్లా రిజిస్ట్రార్ మన్మథ రావు, వ్యవసాయ శాఖ జేడీ శ్రీధర్, నీటిపారుదల శాఖ ఎస్ఈ సుధాకర్, డ్వామా పీడీ చిట్టిరాజు, డీఈవో తిరుమల చైతన్య పాల్గొన్నారు.




మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

మేమున్నామని.. మీకేం కాదని..

వరద బాధితులకు సినీ ప్రముఖుల సాయం









వరదలతో ఇబ్బంది పడుతున్న తెలుగు ప్రజానీకాన్ని ఆదుకునేందుకు కొంతమంది సినీ ప్రముఖులు ఇప్పటికే తమవంతు సాయాన్ని అందించగా బుధవారం మరికొందరు విరాళాలను ప్రకటించారు. వరద బాధితులను ఆదుకునేందుకు చిరంజీవి రూ. కోటి సాయాన్ని ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రుల సహాయనిధికి చెరో రూ. 50 లక్షలు ఇస్తున్నట్లు ఆయన సోషల్ మీడియా వేదికగా తెలిపారు. 'వరద వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులు నన్ను కలిచివేశాయి. పదుల సంఖ్యలో అమాయకులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. అందరూ తమకు తోచినట్లు సహాయ కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలి. ఈ విపత్కర పరిస్థితులు త్వరలోనే తొలగిపోవాలి' అని ఆయన ఆకాంక్షించారు. చిరు తనయుడు రామ్‌చరణ్ సైతం రూ. 50 లక్షల చొప్పున రెండు తెలుగు రాష్ట్రాలకు కలిపి రూ. కోటి విరాళాన్ని ప్రకటించారు. తెలుగు ప్రజలకు అందరూ అండగా ఉండాల్సిన సమయమిదని రామ్‌చరణ్ పేర్కొన్నారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మంగళవారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ. కోటి విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి కూడా రూ. కోటి విరాళంగా ఇస్తున్నట్లు ఆయన బుధవారం ప్రకటించారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో వరద బారిన పడిన 400 పంచాయతీలకు ఒక్కోదానికి రూ. లక్ష చొప్పున మొత్తం రూ. నాలుగు కోట్ల సాయాన్ని అందజేయనున్నట్లు తెలిపారు.

అగ్ర కథానాయకుడు ప్రభాస్ తన వంతుగా రూ. రెండు కోట్ల విరాళాన్ని ప్రకటించారు. తెలంగాణకు, ఆంధ్రప్రదేశ్‌కు రూ. కోటి చొప్పున అందజేయనున్నట్లు ఆయన టీమ్ తెలిపింది. అల్లు అర్జున్ రెండు తెలుగు రాష్ట్రాలకు కలిపి రూ. కోటి విరాళంగా ఇస్తున్నట్లు సోషల్ మీడియా ద్వారా తెలిపారు. ఈ విపత్కర పరిస్థితులు తొలగిపోయి ప్రజలంతా సురక్షితంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. వరద బాధితులను ఆదుకునేందుకు అక్కినేని కుటుంబం, గ్రూపు సంస్థలు రెండు రాష్ట్రాలకు కలిపి రూ. కోటి విరాళాన్ని ప్రకటించాయి. ఏపీ సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ. 25 లక్షల సాయాన్ని ప్రకటించిన వైజయంతీ మూవీస్ సంస్థ తాజాగా తెలంగాణ సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ. 20 లక్షల విరాళాన్ని ప్రకటించింది. నిర్మాత అశ్వనీదత్ బుధవారం ఏపీ సీఎం చంద్రబాబు నాయుడును కలసి చెక్ అందజేశారు. హీరో సాయిదుర్గ తేజ్ ఇరు రాష్ట్రాలకు కలిపి రూ. 20 లక్షలు, విజయవాడలోని అమ్మ ఆశ్రమానికి రూ. 5 లక్షల విరాళం ప్రకటించారు. అలీ, జుబేదా దంపతులు ఇరు రాష్ట్రాలకు కలిపి రూ. ఆరు లక్షలు విరాళంగా ఇస్తున్నట్లు తెలిపారు.

పవన్ కల్యాణ్ - రూ. 2 కోట్లు (ఏపీలోని గ్రామ పంచాయితీలకు రూ. 4 కోట్లు)
ప్రభాస్ - రూ. 2 కోట్లు
చిరంజీవి - రూ. కోటి
రామ్‌చరణ్ - రూ.కోటి
అల్లు అర్జున్ - రూ. కోటి
అక్కినేని కుటుంబం, గ్రూప్ సంస్థలు కలిపి - రూ. కోటి
సాయిదుర్గ తేజ్ -రూ.20 లక్షలు
వైజయంతీ మూవీస్ - రూ. 20 లక్షలు (తెలంగాణకు)
అలీ, జుబేదా దంపతులు - రూ. 6 లక్షలు

సమంతకు గాయం



టాలీవుడ్ కథానాయిక సమంత గాయపడ్డారు. ఈ విషయాన్ని ఆమె బుధవారం సోషల్ మీడియా ద్వారా తెలిపారు. ఎప్పుడు, ఎలా గాయపడ్డారు అనే వివరాలను ఆమె వెల్లడించలేదు. మోకాలి గాయానికి ఆక్యుపంచర్ విధానంలో చికిత్స తీసుకుంటున్నారు సమంత. తన శరీరంలో రెండు సూదులు గుచ్చి ఉన్న ఫొటోను ఆమె షేర్ చేసి, 'గాయాల బారిన పడకుండా యాక్షన్ స్టార్‌ను అవ్వగలనా?' అని సరదాగా స్పందించారు. దీంతో సమంత లీడ్‌రోల్‌లో నటిస్తూ, నిర్మిస్తున్న 'మా ఇంటి బంగారం' చిత్రం షూటింగ్‌లో గాయపడ్డారని భావిస్తున్నారు. ఆమె నటించిన 'హనీ బన్నీ' వెబ్‌సిరీస్ త్వరలో ప్రముఖ ఓటీటీలో స్ట్రీమింగ్ అవనుంది.

లైంగిక వేధింపులకు పాల్పడితే ఐదేళ్ల నిషేధం

నడిగర్ సంఘం మహిళా భద్రతా కమిటీలో తీర్మానం



నటీమణులపై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు రుజువైతే చిత్రపరిశ్రమలో పనిచేయకుండా ఐదేళ్లపాటు నడిగర్ సంఘం నిషేధం విధించనుంది. ఈ మేరకు నడిగర్ సంఘం అనుబంధ విభాగమైన మహిళా భద్రతా కమిటీ సమావేశంలో తీర్మానించారు. ఈ కమిటీ సమావేశం బుధవారం నడిగర్ సంఘం అధ్యక్షుడు నాజర్, ఉపాధ్యక్షుడు పూచ్చి మురుగన్, కోశాధికారి కార్తీ, కమిటీ అధ్యక్షురాలు రోహిణి సారథ్యంలో కమిటీ సభ్యులు సుహాసిని, ఖుష్బూ, లలిత కుమారి, కోవై సరళ తదితరులు పాల్గొన్నారు. ఇందులో కొన్ని తీర్మానాలు చేసి ఏకగ్రీవంగా ఆమోదించారు. లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ఎవరైనా బాధితులు ఫిర్యాదు చేస్తే వాటిపై విచారణ జరిపి నిజమని తేలితే చిత్ర పరిశ్రమలో పనిచేయకుండా ఐదేళ్లపాటు నిషేధం విధించేలా తీర్మానం చేశారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు, న్యాయ సలహాలు ఇప్పించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించనున్నారు. లైంగిక వేధింపులకు పాల్పడిన వారిని తొలుత హెచ్చరించి, ఆ తర్వాత చర్యలకు ఉపక్రమిస్తారు. కమిటీకి ఫిర్యాదు చేసే బాధితులు మీడియాతో ప్రత్యక్షంగా మాట్లాడకూడదు. యూట్యూబ్‌లో సినీ నటులను కించపరిచేలా మాట్లాడేవారిపై బాధితులు సైబర్ విభాగం పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారికి కమిటీ అన్ని విధాలా సహకరిస్తుంది.

- చెన్నై (ఆంధ్రజ్యోతి)

కోరమీనా నిన్ను.. కోసుకుంటా ఇయ్యాలా



జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న 'దేవర 1' చిత్రం నుంచి మాస్ నంబర్‌ను విడుదల చేశారు. 'కొరమీనా నిన్ను.. కోసుకుంటా ఇయ్యాలా' అంటూ రామజోగయ్యశాస్త్రి రాసిన పాట వీడియోను విడుదల చేశారు. ఈ పాటలో ఎన్టీఆర్ వేసిన స్టెప్పులు ఆడియన్స్‌తో డాన్స్ చేయించేలా ఉన్నాయి. ఎన్టీఆర్ డాన్స్ ఎలా ఉండాలని అభిమానులు కోరుకుంటారో దాన్ని మించేలా శేఖర్ మాస్టర్ ఈ పాటకు కొరియోగ్రఫీ అందించారు. జాన్వీకపూర్ గ్లామరెస్‌గా కనిపించారు. ఎన్టీఆర్‌తో పోటీగా స్టెప్స్ వేశారు. 'దేవర' మీద ఇప్పటివరకూ ఉన్న అంచనాలు ఈ పాటతో నెక్ట్స్ లెవల్‌కు చేరాయి. అనిరుధ్ అందించిన సంగీతం పాటకు ప్రాణం పోసింది. హై యాక్షన్ థ్రిల్లర్‌గా రూపుదిద్దుకుంటున్న 'దేవర' రెండు భాగాలుగా ప్రేక్షకులను అలరించనుంది. మొదటి భాగాన్ని ఈ నెల 27న తెలుగు, తమిళ, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదల చేస్తున్నారు. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కల్యాణ్‌రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ నిర్మిస్తున్నారు.

ఇన్ ప్రోగ్రెస్

విడుదల వాయిదా



'ఈ నెల ఏడున 'జనక అయితే గనక' సినిమాను విడుదల చేయాలనుకున్నాం.అయితే ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో వరద పరిస్థితుల కారణంగా విడుదల వాయిదా వేస్తున్నాం. నవ్వుల వినోదం పండించే రోజుని త్వరలో ప్రకటిస్తాం. ప్రేక్షకులు అందరూ థియేటర్లలో చూసి ఆస్వాదించాల్సిన సినిమా కనుక ఈ నిర్ణయం తీసుకున్నాం' అని వెల్లడించారు దిల్ రాజు. సుహాస్ హీరోగా రూపుదిద్దుకున్న 'జనక అయితే గనక' చిత్రానికి సందీప్‌రెడ్డి బండ్ల దర్శకత్వం వహించారు. శిరీష్ సమర్పణలో హర్షిత్‌రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించారు. హీరో సుహాస్ మాట్లాడుతూ 'మూవీ ఫైనల్ వెర్షన్ చూశాను. చాలా బాగా నచ్చింది. అందుకే యుఎస్‌ఏ హక్కులు కొన్నాను. ప్రతి దానికీ లెక్కలు చెప్పే మిడిల్ క్లాస్ యువకుడిగా నటించా. దిల్ రాజుగారు ఎంతో సపోర్ట్ చేశారు' అన్నారు.

పిల్లలతో చూడాల్సిన సినిమా



ప్రియదర్శి, విశ్వదేవ్, నివేద థామస్, గౌతమి ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం '35 చిన్న కథ కాదు'. నందకిషోర్ ఈమాని దర్శకత్వంలో రానాదగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో విడుదలవుతున్న సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ 'ఇది పిల్లలతో కలసి చూడాల్సిన సినిమా. దర్శకుడు ప్రేక్షకుల హృదయాలను హత్తుకునేలా తెరకెక్కించార'ని ప్రశంసించారు.

మరిచిపోలేని థ్రిల్‌ను పంచుతుంది



వరుస అవకాశాలతో దూసుకుపోతున్నారు మీనాక్షీ చౌదరి. వెంకట్ ప్రభు దర్శకత్వంలో విజయ్ సరసన ఆమె నటించిన 'గోట్' (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్) చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర విశేషాలను మీనాక్షీ మీడియాతో పంచుకున్నారు.

"ఈ సినిమాలో నాది చాలా మంచి పాత్ర. ఆ పాత్ర నన్ను నేను రిలేట్ చేసుకునేలా ఉంటుంది. దర్శకుడు వెంకట్ ప్రభు ఈ సినిమాలో ప్రతీ క్యారెక్టర్‌ను చాలా బాగా తీర్చిదిద్దారు. ఈ మూవీ షూటింగ్ సమయంలో విజయ్, స్నేహ, లైలా వంటి అనుభవజ్ఞులైన నటుల నుంచి ఎంతో నేర్చుకున్నాను. ఈ సినిమా అందరికీ మరిచిపోలేని థ్రిల్‌ను పంచుతుంది. విజయ్ యాక్టింగ్, వెంకట్ ప్రభు డైరెక్షన్ స్కిల్స్ ఈ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయి" అని చెప్పారు.

ఫిష్ వెంకట్‌కు సాయం



విలన్ పాత్రల్లోనూ తనదైన శైలిలో కామెడీని పండిస్తూ తెలుగు ప్రేక్షకులను నవ్వించిన ఫిష్ వెంకట్ రెండు కిడ్నీలు పాడై దయనీయ స్థితిలో జీవితం వెళ్లదీస్తున్నారు. మెరుగైన వైద్యం కోసం ఖర్చు పెట్టే స్తోమత లేక ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్నట్లు ఆయన ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. సినిమాల్లో నటించమని పిలుపు వస్తున్నా ఒంట్లో సత్తువ లేక కొన్నేళ్ల నుంచి ఇంటికే పరిమితమైనట్లు చెప్పారు. ఖర్చులకు చేతిలో పైసా లేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని మీడియా ద్వారా తెలుసుకున్న నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు వైద్య ఖర్చుల నిమిత్తం లక్ష రూపాయలను అందజేశారు. ప్రసన్న కుమార్, రామసత్యనారాయణ, కె.అజయ్‌కుమార్, అనిల్ ఈ చెక్కును ఫిష్ వెంకట్‌కు అందజేశారు.



దిక్సూచి DIKSUCHI

జేఎన్‌టీయూకేలో ఎంటెక్ స్పాన్సర్డ్ కోటా



కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూకే)- ఎంటెక్ ప్రోగ్రామ్‌లో స్పాన్సర్డ్ కోటా సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. కనీసం ఏడాది అనుభవం ఉన్న వర్కింగ్ ప్రొఫెషనల్స్ దరఖాస్తు చేసుకోవచ్చు.

విభాగాలు-స్పెషలైజేషన్‌లు

- ★ సివిల్ ఇంజనీరింగ్ - స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, సాయిల్ మెకానిక్స్ అండ్ ఫౌండేషన్ ఇంజనీరింగ్, వాటర్ రిసోర్స్ ఇంజనీరింగ్
- ★ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ - హై ఓల్టేజ్ ఇంజనీరింగ్, అడ్వాన్స్‌డ్ ఎలక్ట్రికల్ పవర్ సిస్టమ్స్, పవర్ ఎలక్ట్రానిక్స్ అండ్ డ్రైవ్స్, పవర్ ఎలక్ట్రానిక్స్
- ★ మెకానికల్ ఇంజనీరింగ్ - క్యాడ్/క్యామ్, మెషిన్ డిజైన్, థర్మల్ ఇంజనీరింగ్
- ★ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ - కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ అండ్ సిగ్నల్ ప్రాసెసింగ్, కంప్యూటర్ అండ్ కమ్యూనికేషన్, వీఎల్ఎస్ఐ అండ్ ఎంబెడెడ్ సిస్టమ్స్
- ★ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ - కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ
- ★ రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంట్ - రెన్యూవబుల్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్
- ★ బయోటెక్నాలజీ, నానోటెక్నాలజీ, రిమోట్ సెన్సింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ, ఏవియానిక్స్, ఎన్విరాన్‌మెంటల్ ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ

అర్హత: సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్/ఏఐఎంఈ లేదా ఎమ్మెస్సీ(కెమిస్ట్రీ/ఫిజిక్స్/బయోటెక్నాలజీ/ఎర్త్‌సైన్స్/ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీ/ఎలక్ట్రానిక్స్/జియాలజీ/ఫుడ్ టెక్నాలజీ/ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్/డెయిరీ టెక్నాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. గేట్ 2024/జీప్యాట్ 2024/ఏపీ పీజీఈసెట్ 2024 ర్యాంక్ ఉండాలి.

- ★ **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 17
- ★ **వెబ్‌సైట్:** www.jntuk.edu.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/cHqjyDZలో చదవండి.

ఐఐఎఫ్‌టీలో సర్టిఫికెట్ ప్రోగ్రామ్

న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)- 'ఆన్‌లైన్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఆన్ ఎక్స్‌పోర్ట్ ఇంపోర్ట్ మేనేజ్‌మెంట్'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది వీకెండ్ ప్రోగ్రామ్. ఇందులో ఆరు మాడ్యూల్స్ ఉంటాయి. దీని వ్యవధి నాలుగు నెలలు(150 గంటలు). ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం పన్నెండుంబావు వరకు, సాయంత్రం రెండు నుంచి అయిదుంబావు వరకు సెషన్స్ నిర్వహిస్తారు. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. ప్రోగ్రామ్‌లో భాగంగా అసైన్‌మెంట్లు, అసెస్‌మెంట్లు, ప్రజంటేషన్స్, ప్రాజెక్ట్ వర్క్‌లు, ఇంటర్నల్ ఎగ్జామ్స్, ఫైనల్ ఎగ్జామ్స్ ఉంటాయి. కోర్సు మెటీరియల్‌కు సంబంధించి లైఫ్ టైమ్ యాక్సెస్ ఇస్తారు. గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 10
- **వెబ్‌సైట్:** www.iift.ac.in





రోడ్లపై చెత్త.. కాలువల్లో మురుగు

● గాడితప్పిన పారిశుధ్య నిర్వహణ ● ఇదీ ఇచ్ఛాపురం మండలంలో పరిస్థితి


పాయితారి రోడ్డుపై మురుగు నీరు

ఇచ్ఛాపురం: మండలంలో పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణ గాడి తప్పింది. ప్రధానంగా రోడ్లపక్కన చెత్త పేరుకుపోయింది. దీనికితోడు కాలువల్లో మురుగు నీరు నిల్వఉండడంతో దోమలు స్వైరవిహారం చేస్తుండడంతో ప్రజలు అవస్థలకు గురవుతున్నారు. 21 పంచాయతీల్లో మురుగుకాలువల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్లపై చెత్త కుళ్లుతుండడంతోపాటు గోతుల్లో వర్షం నీరు నిల్వ ఉండడం వల్ల దోమలకు నిలయంగా మారుతోంది. పలు గ్రామాల్లో గల కాలువల్లో చెత్త రోజుల తరబడి తీయడంలేదు. పాయితారి, కీర్తిపురం, కొళిగాం పంచాయతీల్లో రోడ్డుపై మురుగు, వర్షం నీటి నిల్వ వల్ల ప్రజలు అవస్థలకుగురవుతున్నారు. పలు గ్రామాల్లో చెత్త తరలింపునకు కొనుగోలు చేసిన వాహనాలు మూలకుచేరాయి. కీర్తిపురం పంచాయతీలో కాలువల్లో షిల్ట్ తొలగించ కపోవడంతో రోడ్డుపైకి మురుగు, వర్షం నీరుచేరుతోంది. ఈ నేపథ్యంలో పలు గ్రామాల్లో ప్రజలు వ్యాధులు బారినపడుతున్నారు. కాగా పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని ఎంపీడీవో ఈశ్వరరావు తెలిపారు. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి కాలువల్లో షిల్ట్ తొలగిస్తామని చెప్పారు. ఇప్పటికే గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపడుతున్నామని తెలిపారు.


కొళిగాంలో జనావాసాల్లో చేరిన మురుగు

రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం: ఎమ్మెల్యే


రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న గోవిందరావు

హిరమండలం: పాతపట్నం నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు.బుధవారం మండలంలోని కిట్టాలపాడు పంచాయతీ కూర్మ గ్రామం నుంచి అంతకాపల్లి వరకు ఉపాధి హామీపథకం ద్వారా నిర్మించనున్న సీసీరోడ్డు పనులకు శంకుస్థాపనచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి నిర్మాణాన్ని నాణ్యతగా చేపట్టాలన్నారు. కూటమి ప్రభుత్వం రహదారుల అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తుందని చెప్పారు.కార్యక్రమంలో జడ్పీటీసీ పి.బుచ్చిబాబు,ఎంపీపీ తూలుగు మేనక, సర్పంచ్‌లు ఎం.రామారావు, దారపు డిల్లేశ్వరరావు,యాళ్ళ నాగేశ్వరరావు, ఎంపీడీఓ బి.శైలజ పాల్గొన్నారు.

ధరల నియంత్రణలో ప్రభుత్వాలు విఫలం

టెక్కలి: నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.యుగంధర్ ఆరోపించారు. బుధవారం నిత్యావసర వస్తువుల ధరల పెంపును నిరసిస్తూ నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆయన టెక్కలిలో మాట్లాడారు. ఆయనతో పాటు సీపీఐ నాయకులు కుమార్, రామారావు, సింహాచలం, రాము, ప్రసాద్‌లు ఉన్నారు.

కూలిన పాఠశాల ప్రహరీ


గోడ కూలిపోయిన దృశ్యం

టెక్కలి: టెక్కలి అంబేడ్కర్ కూడలి సమీపంలో గత ప్రాథమికోన్నత పాఠశాల ప్రహరీ బుధవారం కూలిపోయింది.గోడ కూలిన సమయానికి విద్యార్థులులేకపోవడంతో ప్రమాదం తప్పిపోయింది. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు గోడ కూలిపోయి ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. గోడ కూలిన విషయంపై మండల విద్యాశాఖాధికారులకు తెలియజేయనున్నట్లు హెచ్ఎం తెలిపారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం: సీడీపీవో

కోటబొమ్మాళి: తల్లిపాలే బిడ్డకశ్రేయస్కరమని ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్ హైమావతి తెలిపారు. బుధవారం మండలంలోని గంగరాపు గ్రామంలో తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు బిడ్డల పోషణ పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో కె.రూపలత, సూపర్‌వైజర్లు సత్యప్రియ, పద్మలత, హెల్త్‌వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్. శ్రీలత, వైనాగరత్నం, ప్రజాప్రతినిధులు, పేడాడ వెంకటరావు, శివరాం, సుంకరి గణపతిరావు పాల్గొన్నారు.

ఆదర్శంగా నిలిచిన బాలరాజు కుటుంబం: అచ్చెన్న

టెక్కలి/సంతబొమ్మాళి: సంతబొమ్మాళి మండలంలోని గొల్లసీతాపురానికి చెందిన బొమ్మాళి బాలరాజు బ్రెయిన్‌డెడ్‌కావడంతో అవయవదానానికి ముందుకురావడంతో కుటుంబసభ్యులకు మంత్రి కింజరాపుఅచ్చెన్నాయుడు అభినందించారు. బాలరాజు కుటుంబం పదిమందికి ఆదర్శంగా నిలిచిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాలరాజు చనిపోతూ మరో నలుగురికి ప్రాణదానం చేశాడని తెలిపారు. గతనెల 31న టెక్కలిలో ప్రైవేట్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న బాలరాజు విధినిర్వహణలో స్తంభం ఎక్కి విద్యుదాఘాతానికి గురైన విషయం విదితమే. సిబ్బంది జిల్లా కేంద్రాసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం వారు శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ బాలరాజు బ్రెయిన్‌డెడ్ కావడంతో అవయవాలను దానం చేసేందుకు కుటుంబసభ్యులు ముందుకొచ్చిన విషయం విదితమే.


బోరుభద్రలో గురుపూజోత్సవం

బోరుభద్ర జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం గురుపూజోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా గురు ఆకారంలో విద్యార్థులు కూర్చొన్నారు.
- సంతబొమ్మాళి

వరద బాధితులకు విరాళం

నరసన్నపేట: మండలంలోని కంబకాయికు చెందిన రిటైర్డు ఉపాధ్యాయుడు తంగుడు సత్యం ఉమ్మడి తెలుగు రాష్ట్రాలు వరద బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.10వేలు చొప్పున విరాళం యూపీఐ విధానంలో చెల్లించారు. తెలుగు ప్రజలు కష్టాలో ఉండడంతో పింఛన్ సొమ్ము విరాళంగా అందజేసినట్లు చెప్పారు.

నేడు రైల్వేగేటు వద్ద మరమ్మతులు

పలాస రూరల్: నీలావతి రైల్వే గేటు వద్ద గురువారం ఉదయం 6.30 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ మరమ్మతులు చేయనుండడంతో వాహనాలు రాకపోకలు నిలిపివేస్తున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ఒకప్రకటనలో తెలిపారు. వాహనచోదకులు ఈ విషయాన్ని గమనించి వేరే మార్గాల ద్వారా వారి గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరారు.

రేపు వ్యక్తిత్వ వికాస కార్యక్రమం

పలాసరూరల్: రామకృష్ణాపురం సత్యసాయి విద్యావిహార్‌లో శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ విశ్రాంత వీసీ హనుమంత లజపతిరాయ్ వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహిస్తున్నట్లు ట్రస్టు చైర్మన్ మల్లా రామేశ్వరరావు తెలిపారు. విద్యార్థులు తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విజిలెన్స్ ఏఎస్పీగా ప్రసాద్

శ్రీకాకుళం క్రైం: శ్రీకాకుళం రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్పీగా వైబీటీఏ ప్రసాద్‌ను నియమిస్తూ డీజీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. గుడివాడ, పోలవరంల్లో డీఎస్పీగా విధులు నిర్వహించిన ఆయన ఏఎస్పీగా పదోన్నతి పొంది నెల్లూరు క్రైం ఏఎస్పీగా పని చేశారు. ప్రస్తుతం శ్రీకాకుళం రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్పీగా బదిలీపై రానున్నారు.

శాంతిభద్రతలపై దృష్టి: ఎస్ఐ

టెక్కలి: టెక్కలిలో శాంతిభద్రతల పరిరక్షణకు దృష్టి సారిస్తానని సీఐ అంబటి విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం టెక్కలిలో విలేకరులతో మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యను సరిదిద్దుతానని, రౌడీయిజంపై ఉక్కుపాదం మోపుతామని, బెల్టుషాపులు నియంత్రణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. చెప్పారు. వినాయక మండపాల ఏర్పాటుకు సింగిల్ విండో విధానం అమలవుతుందని తెలిపారు.

బెల్లుకోలలో పీఎం జన్‌మన్

నందిగాం: మండలంలోని రధజనబొడ్డపాడు పంచాయతీలో గల బెల్లుకోల, రధజనబొడ్డపాడు, బైరిబొడ్డపాడు, సవరనీలాపురం గ్రామాలకు చెందిన గిరిజనులతో సర్పంచ్ బొడ్డపాటి శశిరేఖ అధ్యక్షతన పీఎం జన్‌మన్ గ్రామసభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో టి.రాజారావు గిరిజన సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పలు పథకాలను వివరించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం కె.జాంభవతి, స్వచ్ఛ కన్వీనర్ ఎ.రాంబాబు పాల్గొన్నారు.

గొట్టాబ్యారేజీపై విద్యుత్ దీపాల ఏర్పాటు

హిరమండలం: గొట్టా బ్యారేజీపై విద్యుత్ దీపాల ఏర్పాటుకు వైరింగ్ పనులను బుధవారం ప్రారంభించారు. వైసీపీహయాంలో బ్యారేజీ నిర్వహణకు ఐదేళ్ల నిధులు కేటాయించలేదు.ఈనేపథ్యంలో బ్యారేజీపై ఉన్న విద్యుత్‌దీపాలు పాడయ్యాయి. రెండేళ్లుగా పూర్తిగా విద్యుత్ దీపాలు లేకపోవడంతో రాత్రి పూట వాహన చోదకులు ఇబ్బందిపడేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వంశధార అధికారులు ఈ విషయాన్ని ఎమ్మెల్యే మామిడి గోవింద రావు, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. కలెక్టర్ నిధులు కేటాయించడంతో విద్యుత్ దీపాలు ఏర్పాటుకు వంశధార అధికారులు చర్యలు చేపట్టారు

ఫ్లైఓవర్ పనులు పూర్తిచేయాలి

పలాస: పలాస రైల్వే స్టేషన్‌ను అమృతభారత్ రైల్వే స్టేషన్‌గాగుర్తించి నిధులు కేటాయించారని, ఆశించినంతగా అభివృద్ధి చేయడం లేదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొర్రాయి బాలకృష్ణయాదవ్ తెలిపారు. కాశీబుగ్గ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని, రైల్వే స్టేషన్ ఆధునికీకరించాలని కోరారు.ఈ మేరకు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. జిల్లాకు వచ్చిన ఆయనకు పలాస రైల్వే సమస్యలు వివరించారు.

60 మెట్రిక్ టన్నుల డీఏపీ సిద్ధం

సంతబొమ్మాళి: మండలంలో రైతులకు 60 మెట్రిక్ టన్నుల డీఏపీ సిద్ధంగా ఉందని ఇన్‌చార్జి ఏవో ఆర్.అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. పీఏసీఎస్ ద్వారా 20 మెట్రిక్ టన్నులు, రుంకుహనుమంతపురం, కొత్తలింగూడు, మేఘవరం, మర్రిపాడు రైతు భరోసా కేంద్రాల 10 మెట్రిక్ టన్నుల అందుబాటులో ఉందని పేర్కొన్నారు. యూరియా కూడా రానుందని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

కొత్తూరు: కొత్తూరులో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ లోతుగడ్డ తులసీవర ప్రసాద్ ప్రకృతి వ్యవసాయ పద్ధతి గురించి వివరించారు. కార్య క్రమంలో శ్రీనివాసరావు, తిరుపతిరావు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ

అరసవల్లి:స్థానిక ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఐఎల్‌వో సంయుక్త ఆధ్వర్యంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు శిక్షణ తరగతులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పరిశ్రమల కేంద్రం జీఎం ఉమామహేశ్వరరావు పారిశ్రామికవేత్తలుగా తయారుకావడానికి అవసరమైన మెలకువలు, వ్యాపార నిర్వహణ, శక్తిసామర్థ్యాలు, వివిధ రకాల అనుమతుల గురించి వివరించారు. సెట్‌శ్రీ సీఈవో ప్రసాదరావు ప్రాజెక్టు రిపోర్టు తయారీ, మార్కెట్ మెలకువలు, నిర్వహణ శక్తి సామర్థ్యాలు, ఖాతా పుస్తకాల నిర్వహణ, వ్యాపారంలో పాటించాల్సిన నియమాలు, ఉత్పత్తి సామర్థ్యం పెంపు, సేల్స్, మార్కెటింగ్ స్కిల్స్‌ను వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి అధికారి కె.సుధ, నైపుణ్యాభివృద్ధి అధికారి పీబీ సాయి శ్రీనివాస్, పర్యాటకాధికారి నారాయణరావు, ఐఎల్‌వో మాస్టర్ ట్రైనర్, మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిపై పరిశోధనలు: కలెక్టర్


కలెక్టర్, ఎమ్మెల్యేకు కిడ్నీ వ్యాధిపై పరిశోధన కిట్లు వినియోగంపై వివరిస్తున్న కొలంబియా యూనివర్సిటీ శాస్త్రవేత్త లెక్స్‌వెన్‌గేన్

పలాస:కొలంబియా యూనివర్సిటీ ప్రతినిధులు ఏడాదిపాటు కిడ్నీ వ్యాధిపై పరిశోధనలు చేస్తారని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు.బుధవారం పలాసలోని బుధవారం కిడ్నీ పరిశోధన కేంద్రంలో కిడ్నీ వ్యాధులు తగ్గించడానికి తీసుకోవాల్సిన చర్యలు, వ్యాధి నిర్ధారణకు జరుగుతున్న పరిశోధనలు పరిశీలించారు.ఈసందర్భంగా ది గ్లోబల్ ఇనిస్టిట్యూట్ వైద్యాధికారి జి.బాలాజీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరిశోధనల వివరాలు వివరించారు. అనంతరం అధికారులు, వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్షించారు.ఈసందర్భంగా కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ కొలంబియా యూనివర్సిటీ పర్యావరణశాస్త్రవేత్త లెక్స్‌వెన్‌గేన్ పరిశోధిస్తారని, వారికి ది గ్లోబల్ ఇనిస్టిట్యూట్ వైద్యబృందం సహకరిస్తుందని తెలిపారు.ఇప్పటివరకూ ఉద్దానంలో 80 మంది నుంచి రక్తనమూనాలు సేకరించారని తెలిపారు. వీరి ఆధ్వర్యంలో పరిశోధనలు పూర్తి చేయడానికి ఏడాది పడుతుందన్నారు. మునిసిపాలిటీలో ఇంటింటా నీరిచ్చేందుకు సమగ్ర నీటి పథకాన్ని పూర్తిస్థాయిలో వినియోగిస్తామని తెలిపారు. ఆరు ఎంఎల్‌డీ ఇచ్చేందుకు పరిశీలిస్తామని చెప్పారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ శుద్ధ జలాలు అందిస్తే 50శాతం కిడ్నీవ్యాధి నయమయ్యే అవకాశంఉందని తెలిపారు. పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటి తాగునీటిసమస్య తీవ్రంగా ఉందని, సమగ్ర మంచినీటి పథకాన్ని ఇక్కడకు ఇవ్వాలని కలెక్టర్‌నుకోరారు. ఈసందర్భంగా కలెక్టర్ దృష్టికి కిడ్నీఆసుపత్రి సమస్యలు సూపరింటెండెంట్ ఎ.పద్మజ తీసుకువెళ్లారు.కిడ్నీ వ్యాధిపై పరిశోధనకు వచ్చిన కొలంబియా యూనివర్సిటీ శాస్త్రవేత లెక్స్‌వెన్ గేన్స్‌తో కలెక్టర్, ఎమ్మెల్యే చర్చించారు. పరిశోధనకు సంబంధించిన వివరాలు, పరికరాల పనితీరు వివరించారు.కార్యక్రమంలో వైద్యులు కూన మోహన్ బాబు, రామ్‌నరేష్, టీడీపీనాయకులు వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు, దువ్వాడ శ్రీకాంత్, గాలికృష్ణారావు, సూర్యనారాయణ, బడ్డ నాగరాజు, శ్రీనివాస్, తహసీల్దార్ సత్యం,ఎంపీడీవో రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

జలుమూరు: పరిసరాలు పరిశుభ్రంతోనే ఆరోగ్యం ఉండొచ్చని జలుమూరు పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి చిన్నరాజులు తెలిపారు.బుధవారం పెద్దదూగాంలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంటు చిన్నారావు, ఏఎన్ఎం సత్యవతి పాల్గొన్నారు.

హెల్పర్ కుటుంబాన్ని ఆదుకోవాలి

ఎల్.ఎన్.పేట: పూశాం అంగన్‌వాడీ కేంద్రం హెల్పర్ కె.శార్వాణమ్మ(35) కుటుంబానికి ఆదుకోవాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ యూనియన్ నాయకులు కేవీ హేమలత, నిర్మల, సుభాషిణి కోరారు.ఈ మేరకు శార్వాణమ ఇటీవల మృతి చెందడంతో బుధవారం పూశాంలో ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు.కార్యక్రమంలో ప్రసాద్, సంగీత, ఆరుద్ర, నీలవేణి, భాగ్య, లక్ష్మి పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

మందస: పలాస మండలంలోని బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరంలో ఈనెల ఎనిమిదో తేదీన జరిగే ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా రెండో మహాసభ విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.నారాయణరావు, సి.దుర్యోధన బుధవారం పిలుపునిచ్చారు. మందసలో ఏర్పాటుచేసిన కార్య క్రమంలో మాట్లాడుతూ మహిళల కార్మికుల సమస్యలు-చట్టాలు అనే అంశంపై చర్చించడం జరుగుతుందని తెలిపారు.

మరువాడకు బస్సు సేవలు పునరుద్ధరణ

సంతబొమ్మాళి:మరువాడకు ఆర్టీసీ బస్సు సర్వీసును మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు బుధవారం అధికారులు పునరుద్ధరించారు.గతంలో ఉదయం 7,11 గంటలకు బస్సు నడిచేది. మధ్యాహ్నం రెండు గంటలకు సర్వీసు నిలిపివేశారు.దీంతో జిల్లా తెలుగుయువత కార్యదర్శి దాసురాజు, మాజీ వైస్ ఎంపీపీ సూరాడ భీమారావు, టీడీపీ నాయకుడు సూరాడ ధనరాజ్‌లు అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. ఈనేపథ్యంలో అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు బుధవారం నుంచి సర్వీసును టెక్కలి ఆర్టీసీ అధికారులు బస్సు సేవలు పునరుద్ధరించారు.

లబ్ధిదారులకు మొక్కల పంపిణీ

నందిగాం: ఉపాధి హామీ పథకం కింద ఉద్యానవన పంటల్లో భాగంగా టీపీలు, ఎఫ్ఏలు మొక్కలుపంపిణీ చేపట్టారు. ఏపీవో ఎం.నాగరాజు ఆధ్వర్యంలో 17 గ్రామాలకుచెందిన గుర్తించిన లబ్ధిదారులకు మామిడి,జీడి, కొబ్బరి, సపోటా, జామ తదితర రకాలకు చెందిన 1,744 మొక్కలను అందించారు.

పరిశుభ్రత పాటించకపోతే చర్యలు: డీఎల్‌పీవో

మెళియాపుట్టి: పరిశుభ్రత పాటించని అధికారులపై చర్యలు తీసుకుంటామని డీఎల్‌పీవో ఐవీ రమణ తెలిపారు. బుధవారం జాడుపల్లి, పరశరాపురం పంచాయతీలో పారిశుధ్యపనులు పరిశీలించారు. కార్యక్రమంలో కార్యదర్శి శివాజీ పాల్గొన్నారు.

●పాతపట్నం: పచ్చదనం పెంచేందుకు మొక్కలు నాటడంతోపాటు వాటి పరిరక్షణతోనే లక్ష్య సాధన సాధ్యమని టెక్కలి డీఎల్‌పీవో ఐవీ రమణ తెలిపారు. టెక్కలి ఆలాంధ్రరోడ్‌లో గల చెత్త నుంచి సంపదతయారీకేంద్రప్రాంగణంలో మనం వనం కార్యక్రమంలో భాగంగా మొక్కలునాటారు. కార్యక్రమంలో పాతపట్నం పంచాయతీ ఇన్‌చార్జి ఈవో దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

● హిరమండలం: గ్రామాల్లో పారిశుధ్య పనులు పట్టాలని టెక్కలి డీఎల్‌పీవో ఐవీ రమణ కోరారు. హిరమండలంలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తుండడంతో రహదారులు, కాలువల్లో మురుగు లేకుండా శుభ్రం చేయాలన్నారు.

ఎమ్మెల్యేపై అసత్య ప్రచారం మానుకోవాలి

పాతపట్నం: ఎమ్మెల్యే మామిడి గోవిందరావుపై అసత్యప్రచారం మానుకోవాలని టీడీపీ మండలాధ్యక్షుడు సైల బాబ్జీ కోరారు. బుధవారం పాతపట్నంలోని ఎమ్మెల్యే ఎంజీఆర్ క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఓ పత్రికలో ఎమ్మెల్యేపై ప్రచురించిన కథనాన్ని ఖండించారు. ఎమ్మెల్యేకు వస్తున్న ఆదరణచూసి ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు అసత్యప్రచారం చేస్తున్నారని తెలిపారు.గత ప్రభుత్వ హయాంలో ఆక్రమణలకు గురైన ఎర్రచెరవు గర్భంలో ఆక్రమణలను తొలగించి చుట్టూ మినీపార్కు తరహా ఆహ్లాదకరవాతావరణాన్ని తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తుంటే అసత్యప్రచారంతో అడ్డుకొనే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో కొత్తూరు వైస్ఎంపీపీ అగతముడి మాధవరావు,టీడీపీ నాయకులు సైలాడ సతీష్, సిర్ల జోగారావు పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

శ్రీకాకుళం స్పోర్ట్స్:మానసికోల్లాసానికి క్రీడలు దోహదపడతాయని జిల్లా పీఆర్ జేఏసీ సెక్రటరీ జనరల్ కేసీహెచ్ మహంతి తెలిపారు.బుధవారం శ్రీకాకుళంలో ఇంజనీర్స్‌డే పురస్కరించుకుని పీఆర్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో ఆటల పోటీలు ప్రారంభించారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరిగిన వాలీబాల్ పోటీల్లో పాలకొండ విజేతగా, ఎచ్చెర్ల రన్నర్‌గా నిలిచాయి. గురువారం నుంచి శివానీ కళాశాల ఆవరణలో క్రికెట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈలు ఎస్.పోలినాయుడు, అంజిత్ కుమార్ పాల్గొన్నారు.

గ్రంథాలయంలో డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతం: వీసీ


మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ రజని

ఎచ్చెర్ల: గ్రంథాలయంలో డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయనున్నట్లు వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో బుధవారం గ్రంథాలయ సలహా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్సిటీలోని అన్ని విభాగాలకు రూ.25 లక్షలతో కొత్త పుస్తకాల కొనుగోలుకు నిర్ణయం తీసుకున్నారు. విద్యార్థుల కోసం గుర్తింపు పొందిన జర్నల్స్‌కు,ఆన్‌లైన్ ప్రచురణలకు వార్షిక చందా చెల్లించాలని నిర్ణయించారు. సమావేశంలో రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, ఏయూ లైబ్రరీ సైన్స్ విభాగం పూర్వ అధ్యాపకులు కె.ఉమామహేష్ యాదవ్, వర్సిటీ ఓఎస్‌డీ యు.కావ్యజ్యోత్స్న, ప్రిన్సిపాల్ ఎస్.ఉదయభాస్కర్, ఎం.అనూరాధ పాల్గొన్నారు.

బొగాబెణి వెంచర్ పరిశీలన


వెంచర్‌లో రికార్డును పరిశీలిస్తున్న ఆర్డీవో భరత్‌నాయక్

కంచిలి: బొగాబెణి వెంచర్‌ను ఆర్డీవో భరత్ నాయక్ బుధవారం పరిశీలించారు. బొగాబెణి పంచాయతీ మహల్పడా గ్రామ సమీపంలో గ్రామస్థుల భూమితోపాటు ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించి వెంచర్ వేసినట్టు ఫిర్యాదులు అందాయి. దీంతో ఈ వెంచర్‌ను ఆర్డీవో రెవెన్యూ అధికారులతో వెళ్లి పరిశాలించారు. తహసీల్దార్ వై.జయలక్ష్మి, సర్వేయర్ నాగేశ్వరరావులతో స్థలం వివరాలను అడిగి తెలుసుకున్నారు.


పంట నమోదు తప్పనిసరి: ఏవో

జి.సిగడాం: ప్రతి రైతు పంట నమోదు చేసుకోవాలని ఏవో ఎర్రా శారద తెలిపారు. బుధవారం నిద్దాంలో శ్రీకాకుళం ఆత్మ సౌజన్యంతో రైతు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆమె ఈ పంట నమోదు గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో రైతు శిక్షణా కేంద్రం శాస్త్రవేత్త సూర్యకుమారి, జిల్లా వనరులు కేంద్రం డీడీఏ త్రినాథస్వామి, శాస్త్రవేత్తలు జి.చిట్టిబాబు, జోజుబాబు, భూనుప్రియాంక పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదైతేనే రాయితీలు

ఎల్.ఎన్.పేట: ఈ-క్రాప్ నమోదుచేస్తేనే ప్రభుత్వం ప్రకటించిన రాయితీలు పరిహారం, బీమా వర్తిస్తాయని ఏవో పి.లతాశ్రీ తెలిపారు. బుధవారం చింతలబడవం జలో రైతులకు ఈ-క్రాప్ నమోదు చేయించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాగావళి నదిలో వ్యక్తి గల్లంతు


అప్పారావు(ఫైల్)

ఎచ్చెర్ల: పొన్నాడ గ్రామానికి చెందిన అంపోలు అప్పారావు (50) అనే వ్యక్తి నాగావళి నదిలో బుధవారం ఉదయం బట్టలు ఉతకడానికి వెళ్లి గల్లంతలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అప్పారావు తన భార్య లక్ష్మి, మరో ఇద్దరితో కలిసి వృత్తిలో భాగంగా బట్టలు ఉతికేందుకు నదికి వెళ్లాడు. బట్టలు ఉతికేందుకు వినియోగించే బండ రాయి ఇసుక మేట వేసి మునిగిపోవడంతో దానిని తీసేందుకు ప్రయత్నించి.. వరద నీటికి గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు అందరూ కలిసి సాయంత్రం వరకూ వెతికినా.. అప్పారావు ఆచూకీ లభించలేదు. దీంతో అప్పారావు భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు.. ఏఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అప్పారావుకు భార్య లక్ష్మి, కుమారుడు ఎర్రన్నాయుడు ఉన్నారు.

గాయపడిన మహిళ మృతి


నరసమ్మ(ఫైల్)

బూర్జ: మదనాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. మదనాపురం గ్రామానికి చెందిన మజ్జి నరసమ్మ (58) మంగళవారం రాత్రి చికెన్ కొట్టుకు వెళ్లి వస్తూ.. రోడ్డు దాటుతుండగా అదే సమయంలో బైక్‌పై వస్తున్న వ్యక్తి బలంగా ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. చికిత్స కోసం ఆమెను 108 వాహనంలో కుటుంబ సభ్యులు శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని యువకుడు..

పొందూరు/జి.సిగడాం: పొందూరు రైల్వేస్టేషన్ పరిధి జి.సిగడాం మండలం వాంగ్రంగి రైల్వేగేట్ సమీపంలో బుధవారం రైలు ఢీకొని గుర్తుతెలియని యువకుడు (20) మృతి చెందినట్టు జీఆర్పీ ఎస్ఐ మధుసూధనరావు తెలిపారు. మృతి చెందిన యువకుడు బ్లూ జీన్ ఫ్యాంట్, నాచు రంగు టీషర్టు ధరించాడని, చేతికి వాచి ధరించాడని మెడలో నలుపురంగు తాడు, తాయెత్తు ఉన్నాయన్నారు. సమాచారం కోసం 94934 74582 ఫోన్ నెంబరులో సంప్రదించాలన్నారు.

అనుమానాస్పదస్థితిలో ఒకరు..

మెళియాపుట్టి: బందపల్లి గ్రామానికి సమీపంలో గల మెళియాపుట్టి-టెక్కలి రోడ్డులో ఉన్న కల్వర్టులో పడి ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. ఎస్ఐ టి.రాజేష్ తెలిపిన వివరాల మేరకు.. నందిగాం మండలం రామపురం గ్రామానికి చెందిన బడకల కృష్ణుడు(58) శనివారం నర్సింగపల్లిలోని తన చెల్లెలు ఇంటికి వెళ్లి వస్తానని భార్య దుర్గమ్మకు చెప్పి బయలుదేరాడు. ఆ తర్వాత అతడి ఆచూకీ లేకపోవడంతో కుటుంబసభ్యులు పలుచోట్ల వెతికారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం కల్వర్టు వద్ద దుర్వాసన రావడంతో బందపల్లి గ్రామస్థులు పరిశీలించారు. మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందజేశారు. కాగా కృష్ణుడు సారాకు బానిస కావడంతో తరచూ ఇటువైపు వస్తుంటాడని, తాగిన మైకంలో కల్వర్టుపై పడుకొని తూగి పడిపోయి మృతి చెంది ఉండొచ్చన్న అనుమానాలు స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. కృష్ణుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నేరడి వద్ద మరొకరు..

కొత్తూరు: నేరడి వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. మురళీపేటకు చెందిన సనపల విష్ణు కార్పెంటర్, ఎలక్ట్రికల్ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. బుధవారం ఉదయం నేరడిలో నిరుపయోగంగా ఉన్న పంపుషెడ్ నుంచి దుర్వాసన రావడంతో గ్రామస్థులు గుర్తించారు. విష్ణు మృతదేహం గుర్తించి వీఆర్వో శ్రీనుకు సమాచారం అందించారు. అనంతరం పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. విష్ణు నాలుగు రోజులుగా ఇంటికిరాలేదని, మద్యం మత్తులో మృతి చెంది ఉండొచ్చని భార్య అన్నమ్మ ఫిర్యాదు మేరకు కొత్తూరు ఎస్ఐ ఎంఏ అహ్మద్ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం తరలించారు. విష్ణుకి కుమారుడు మణికంఠ ఉన్నారు.

విష జ్వరంతో వృద్ధురాలు..

ఇచ్ఛాపురం: విషజ్వరాలు ప్రబలుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం డొంకూరు గ్రామానికి చెందిన పొన్నగంటి సీతమ్మ(70) విషజ్వరంతో బాధపడుతూ మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు సీతమ్మ గత 15రోజులుగా జ్వరంతో బాధపడుతూ ఇచ్ఛాపురంలో గల ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం జ్వరం తీవ్రం కావడంతో ఆసుపత్రిలోనే చికిత్స పొందుతూ మృతి చెందింది. సీతమ్మకు ఇద్దరు కుమార్తెలే ఉండడంతో.. చిన్న కుమార్తె చంద్రమ్మ చితికి నిప్పటించి దహన సంస్కారాలు పూర్తిచేశారు. కాగా డొంకూరులో ప్రతి ఇంటిలో జ్వరపీడితులు ఉన్నా వైద్యాధికారులు పట్టించుకోవడం లేదని ఆ గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని కోరుతున్నారు.

గంజాయి రవాణాపై నిఘా

శ్రీకాకుళం క్రైం: జిల్లాలో గంజాయి నియంత్రణే లక్ష్యంగా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పోలీసు పనిచేస్తున్నారు. గంజాయి బాబులతో పాటు వారికి సప్లై చేస్తున్న వారిపై కూడా ప్రత్యేకనిఘా ఏర్పాటు చేశారు. ఈ మేరకు శ్రీకాకుళం సీఐ కె.పైడపునాయుడు బుధవారం ఆపరేషన్ గంజాయి చేపట్టారు. ఈ క్రమంలో నగరంలో గంజాయి తాగేవారిపై దృష్టి సారించారు. దీంతో సుమారు తొమ్మిది మంది గంజాయి తాగుతూ పట్టుబడ్డారు. వారిని సీఐ విచారించారు. గంజాయి రవాణా చేసే వారి ఆచూకీ కోసం సీఐ విస్తృత తనిఖీలు చేస్తున్నారు.

పిచ్చికుక్క స్వైరవిహారం.. 27 మందికి గాయాలు

పొందూరు: మండల కేంద్రంలోని మహరాజా మార్కెట్‌లో బుధవారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. మార్కెట్‌కు సరుకులు కొనుగోలు కోసం వచ్చినవారిపైనా, స్థానికులపైనా దాడిచేసింది. దీంతో 27 మందికి గాయాలలయ్యాయి. వీరంతా స్థానిక ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారు. పొందూరు గ్రామానికి చెందిన జి.అన్నాజీ, వి.వెంకటగోవిందరావు, ఆర్.పారారావు, గారపేటకు చెందిన యు.సుజాత, ఎ.ప్రదీప, వి.జోగలమ్మ, వి.చిరంజీవి, మజ్జిలపేటకు చెందిన వి.మల్లేశ్వరరావు తదితరులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రాంతంలో గత కొన్ని నెలలుగా కుక్కలు గుంపులు, గుంపులుగా సంచరిస్తుండడంతో మార్కెట్‌కు వచ్చేవారు హడలిపోతున్నారు. కుక్కల నియంత్రణకు పంచాయతీ సిబ్బంది దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

హరిపురంలో బంగారం చోరీ

హరిపురం: మందస మండలంలోని హరిపురంలోని ఓ ఇంట్లో మంగళవారం రాత్రి ఎనిమిది తులాల బంగారం చోరీ జరిగింది. మందస ఎస్ఐ ఖాదర్‌భాషా కథనం మేరకు.. హరిపురం బజారు వీధిలో పోస్టాఫీసు ఎదురుగా నివాసముంటున్న నల్ల మోహనరావు గతనెల 31న ఇంటికి తాళం వేసి విశాఖలో ఉంటున్న తన కుమారుడు ఇంటికి కుటుంబ సభ్యులతో వెళ్లారు. బుధవారం ఉదయం పక్కంటివారు చూసేసరికి తాళం విరిగి తలుపులు తీసి ఉండడంతో మోహనరావుకు ఫోన్ చేసి చెప్పారు. వెంటనే ఆయన విశాఖ నుంచి ఇంటిలో చూడగా బీరువా తాళాలు పగలుగొట్టి దొంగతనం జరిగినట్టు గుర్తించారు. ఈ మేరకు మోహనరావు ఫిర్యాదు మేరకు ఘటనా స్థలాన్ని డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐ ఈశ్వరరావు, ఎస్ఐలు శ్రీకాకుళం నుంచి క్లూస్ టీం తెప్పించి పరిశీలించారు. ఘటనపై ఎస్ఐ కేసు నమోదు చేశారు.

మహిళకు గాయాలు

టెక్కలి: నౌపడా-మెళియాపుట్టి రోడ్డులో గూడెం సమీపంలో బుధవారం కోటబొమ్మాళి మండలంలోని చిన్నసానకు చెందిన సింగుపురం జయలక్ష్మి ద్విచక్ర వాహనంపై నుంచి జారిపడి గాయపడింది. మెళియాపుట్టి మండలం జాడుపల్లి నుంచి సోదరుడి ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఈ ఘటన జరిగింది. స్థానికులు జయలక్ష్మిని జిల్లా కేంద్రాసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్సకోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇసుక ర్యాంపు పరిశీలన

బూర్జ: మామిడివలస పంచాయతీ కాఖండ్యాం ఇసుక ర్యాంప్ నుంచి ప్రభుత్వ నిబంధనలు బేఖాతరు చేస్తూ తరలిస్తున్నారని గుత్తావల్లి గ్రామానికి చెందిన సనపల సురేష్‌కుమార్ కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం మైన్స్, పోలీస్, రెవెన్యూ యంత్రాంగం ఆ ర్యాంప్‌ను పరిశీలించారు. ఈ నెల 1న ర్యాంప్ నిర్వహణలో జరిగిప విషయలు తెలుసుకున్నారు. సురేష్‌తో సహా కమిటీ సభ్యులు ర్యాంపు వద్ద ఇసుక నిల్వలు పరిశీలించారు. నివేదిక కలెక్టర్‌కు అందిస్తామని అధికారులు తెలిపారు. పరిశీలనలో శ్రీకాకుళం ఆర్డీవో సీహెచ్ రంగయ్య, మైన్స్ ఈడీ సత్యనారాయణ, శ్రీకాకుళం డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ ఈశ్వరమ్మ, పాతపట్నం తహసీల్దార్ కిరణ్‌కుమార్, పోలీస్‌స్టేషన్ ఎస్ఐ ప్రవల్లిక తదితరులు ఉన్నారు.

వీరు.. ఒకప్పుడు ఉపాధ్యాయులే!

వారు తొలుత ఉపాధ్యాయ వృత్తి చేపట్టారు. ఒకపక్క బోధనా సాగిస్తూనే మరోపక్క పోటీ పరీక్షలు రాసి విజయం సాధించారు. దీంతో ఉపాధ్యాయ వృత్తిని వదిలి ఇతర రంగాల్లో ఉన్నత స్థానంలో ఉన్నారు. నేడు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వారిపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.


శ్రీనివాసరావు


రుప్ప సురేష్

బెత్తం వదిలి.. లాఠీ పట్టి

నరసన్నపేట: ప్రస్తుతం నరసన్నపేట సీఐగా పని చేస్తోన్న జె.శ్రీనివాసరావు ఒకప్పుడు ఉపాధ్యాయునిగా విధులు నిర్వహించారు. శ్రీనివాసరావుది విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం చిలకలపల్లి గ్రామం. 1996 డీఎస్సీకి ఎంపికై భోగాపురం మండలం చేపలకంచేరు గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా చేరారు. 1996లో ఎస్ఐగా ఎంపికై ఉమ్మడి విశాఖ జిల్లాలోని సిలేరు, పాయకరావుపేట, కశింకోట, మాకవరపుపాలెంలో విధులు నిర్వహించారు. 2010లో సీఐగా పదోన్నతి పొందారు. చింతపల్లి, పాతపట్నం, కొత్తూరు విధులు నిర్వహించారు. ప్రస్తుతం నరసన్నపేటలో పనిచేస్తున్నారు. ఉపాధ్యాయవృత్తే సమాజాన్ని నిర్దేశించే గౌరవప్రదమైన ఉద్యోగమని ఆయన అంటున్నారు. శాంతిభద్రతలను పరిరక్షించే పోలీసులతో పాటు ఎంతో మంది విజ్ఞానవంతులను తయారు చేసేది ఉపా ధ్యాయుడేని, తల్లిదండ్రుల తరువాత స్థానం గురు వుకే దక్కుతుందని తెలిపారు.

ఎస్‌బీఐ మేనేజరుగా..

మడపాం గ్రామానికి చెందిన రుప్ప సురేష్ 2008 డీఎస్సీ ఎంపికై 2010లో ఉపాధ్యాయ వృత్తిని చేపట్టాడు. నాలుగు నెలల పాటు పని చేశాడు. స్టేట్‌బ్యాంకులో ఉన్నత ఉద్యోగం రావడంతో ఉపాధ్యాయ వృత్తిని వదిలేశాడు. ఎస్‌బీఐ మేనేజర్‌గా, చీఫ్ మేనేజర్‌గా పదోన్నత పొందారు. ప్రస్తుతం తాడేపల్లిగూడెం ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌లో చీఫ్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఉపాధ్యాయునిగా చేసిన అనుభవం ఉండడంతోనే బ్యాంకు ఖాతాదారులు ఆన్‌లైన్ మోసాలు బారిన పడకుండా సులువుగా వారికి అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైందని ఆయన చెప్పారు.

ఏసీబీ జేడీగా..


రామ్మోహన్‌రావు

ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణానికి చెందిన జల్లేపల్లి రామ్మోహన్‌రావు 1996లో ఉపాధ్యాయునిగా ఎంపికయ్యారు. సరుబుజ్జిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధుల్లో చేరారు. ఒకపక్క ఉపాధ్యాయుడిగా పని చేస్తూ మరో పక్క గ్రూప్స్‌కు ప్రిపేర య్యేవారు. 2010లో గ్రూప్-1 పరీక్షల్లో విజయం సాధించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నిజామాబాద్ సబ్ డివిజన్‌లో పోలీస్ అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం రాష్ట్ర పోలీస్‌శాఖలో ఏసీబీ జాయింట్ డైరక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

వరద బాధితులకు సాయంగా..



అరసవల్లి: విజయవాడ వరద బాధితులకు సాయంగా మేమున్నామంటూ.. జిల్లాలో పెద్ద ఎత్తున ప్రజలు, స్వచ్ఛంద సేవా సంస్థలు సహాయాన్ని అందిస్తున్నారు. బుధవారం రెడ్‌క్రాస్ శ్రీకాకుళం శాఖ చైర్మన్ పి.జగన్మోహన్ రావు ఆధ్వర్యంలో ఆహార కిట్లతో కూడిన వాహనాన్ని విజయవాడకు పంపించారు. ఈ వాహనానికి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం రాత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ వాహనంలో సుమారు రూ.5,50,000 విలువ చేసే 12వేల లీటర్ల తాగునీరు, పది కార్టున్ల బిస్కెట్లు, వంద దోమతెరలు, 500 ఆహార కిట్లు, దుప్పట్లు, తువ్వా ళ్లు ఉన్నాయి. సాయం అందించిన దాతలను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సెక్రటరీ బలివాడ మల్లేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

విజయవాడకు కార్మికులు..

బాధిత ప్రజలకు సహాయ సహకారాలు అందించేందుకు శ్రీకాకుళం మున్సిపల్ కార్మికులు విజయవాడకు బస్సులో బయలుదేరారు. ఈ బస్సును ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రారంభించారు. లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ వారు సమకూర్చిన విరాళం మొత్తాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి జమచేసేలా ఎమ్మెల్యే గొండు శంకర్‌కు అందించారు. కార్యక్రమంలో నటుకుల మోహన్, ప్రధాన విజయరాం, గుత్తు చిన్నారావు, మాదారపు వెంకటేష్, రెడ్డి గిరిజాశంకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే వరద బాధితులకు సహాయంగా సీపీఎం ఆధ్వర్యంలో నగరంలో విరాళాలు సేకరిస్తున్నారు.

చరిత్రహీనుడు జగన్

● ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస: వరదల్లో అష్టకష్టాలు పడుతున్న ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు అందిస్తున్న సాయాన్ని కూడా రాజకీయం చేస్తున్న తుగ్లక్, మాజీ సీఎం జగన్ చరిత్రహీనుడిగా నిలిచిపోతారని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. బుధవారం ఆయన మున్సిపాలిటీ, మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల అనారోగ్యంతో మరణించిన వారి కుటుంబాలను ఆయన పరామర్శించారు. కనుగులవలసలో టీడీపీ మండల అధ్యక్షుడు నూకరాజు ఇంటి వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. విజయవాడ నగరంలో వరదలు విలయతాండవం చేసి బాధితులు ఆహాకారాలు చేస్తున్న సమయంలో రాత్రి, పగలు తేడా లేకుండా 75 ఏళ్ల వయసులో యువకుడిలా చంద్రబాబు చేస్తున్న సేవలను ప్రపంచమంతా కొనియాడుతున్నారన్నారు. దానిని చూసి ఓర్వలేని సైకో జగన్ తూతూ మంత్రంగా పర్యటించి ఫొటోలకు పోజిచ్చి కూటమి ప్రభుత్వంపై తప్పుడు పేలాపనలు పేలడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో బుడమేరు కరకట్లను పూర్తిగా నిర్లక్ష్యానికి గురిచేయడం వల్లే విజయవాడలో ఈ పరిస్థితి నెలకొందని అప్పటి యంత్రాంగం తెలియజేసినా పట్టించుకోకపోగా.. ఇప్పుడు వక్రీకరించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నూకరాజు, పార్టీ రాష్ట్ర న్యాయ విభాగ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్, నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ పేడాడ సూరపునాయుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ కూన అప్పలనాయుడు, నాయకులు పాల్గొన్నారు.


సచివాలయంలో హాజరు పట్టీ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

సచివాలయ ఉద్యోగుల పనితీరుపై ఫిర్యాదు

ఆమదాలవలస: సైలాడ గ్రామ సచివాలయ ఉద్యోగుల పనితీరుపై ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ కలెక్టర్, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. బుధవారం సైలాడ గ్రామంలో పర్యటించిన ఆయన గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. తొలుత ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించి సంతకాల డొల్లతనాన్ని గుర్తించారు. ఎమ్మెల్యే అప్పటికే సచివాలయంలో ఉన్న ఇద్దరు ఉద్యోగులను మిగిలిన ఉద్యోగులపై ప్రశ్నించారు. వారి నుంచి సరైన సమాధానం రాలేదు. దీంతో గ్రామ సచివాలయ ఉద్యోగుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

తెప్పలవలసలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ


విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

రణస్థలం: తెప్పలవలస గ్రామంలో అంబేడ్కర్ యువసేన పిలుపు మేరకు బుధవారం ఆ గ్రామంలో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలన్నారు. ప్రతి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, లంక శ్యామలరావు, లంక ప్రభ, కనకారావు, ముక్కు ఆదినారాయణ, దువ్వాన అప్పలసూరి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలి


విద్యార్థినులతో మాట్లాడుతున్న న్యాయాధికారి సన్యాసినాయుడు

గుజరాతీపేట: రాజ్యాంగంపై విద్యార్థులకు అవగాహన అవసరమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. స్థానిక మహిళా కళాశాల సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో న్యాయవిజ్ఞాన సదస్సు బుధవారం నిర్వహించారు. లోక్‌ఆదాలత్ వల్ల ఉపయోగాలను వివరిస్తూ, బీద ప్రజలు క్రిమినల్ కేసులుంటే న్యాసేవాధికార సంస్థ ద్వారా సహకారం అందిస్తామన్నారు. అనంతరం హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. పిల్లలకు అందిస్తున్న భోజన సదుపాయాలపై ఆరా తీశారు. అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి ఎం.సుజాత, పి.చిన్నమ్మి, పి.సరిత, ఎం.స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాల బలోపేతానికి కృషి

కలెక్టరేట్: మహిళా స్వయం సహాయక సంఘాల బలోపేతానికి కృషి చేయాలని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ పీడీ ఎం.కిరణ్‌కుమార్ అన్నారు. స్థానిక రైతుబజార్ దరి పట్టణ మహిళా సామాజిక వనరుల కేంద్రంలో మెప్మా జిల్లా సిబ్బందికి, మహిళా సమాఖ్య అధ్యక్షులకు, పట్టణ సమాఖ్యల ఆర్పీలకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా మెప్మా పీడీ మాట్లాడుతూ.. పట్టణ స్వయం సహాయక సంఘాలు, వీధి విక్రయదారులు, విభిన్న ప్రతిభావంతులలో సుస్థిర జీవనోపాధి పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మెప్మా పరిపాలనాధికారి ఎస్వీ రమణ, ఎ.వెంకటరావు, సిబ్బంది రాము, వెంకటరావు, భాస్కరరావు, విజయకుమారి, శ్రీకాకుళం, ఆమదాలవలస, పలాస, ఇచ్ఛాపురం పురపాలక సంఘాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తీర ప్రాంతాల్లో సాగర్ కవచ్


సూచనలిస్తున్న మెరైన్ సీఐ

గార: మండలంలో తీర ప్రాంత గ్రామాల్లో బుధవారం మెరైన పోలీసులు సాగర్ కవచ్‌లో భాగంగా గస్తీ చేపట్టారు. తీరప్రాంత గ్రామాలతో పాటు, ముఖ్య కూడళ్ల వద్ద మెరైన్ సీఐ బి.ప్రసాదరావు, సిబ్బంది తనిఖీలు చేపట్టారు. అనుమానిత వ్యక్తులు కదలికలు పై నిఘా ఉంచారు. తీర ప్రాంత గ్రామాల్లో పర్యటించి అక్కడ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సాగర్‌కవచ్ గురువారం కూడా కొనసాగుతుందన్నారు.

హెచ్ఐవీపై అవగాహన

ఇచ్ఛాపురం: హెచ్ఐవీ-ఎయిడ్స్ మహమ్మారిపై అప్రమత్తంగా ఉండాలని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ పి.దేవేంద్రరెడ్డి అన్నారు. బుధవారం ఏఎస్‌పేట బోర్డర్‌లో హెచ్ఐవీ ఏఈసీ రిస్క్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బోర్డర్ ఆఫ్ ఇండియా ట్రాన్స్‌పోర్టు వద్ద కండోమ్ బాక్స్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైద్యులు మాధవరావు, జయలక్ష్మి, అరుణ్‌కుమార్, రవికుమార్, త్రిలోచన, లింగరాజు, ప్రాజెక్ట్ మేనేజర్ ఎం.మాధవరావు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలకు మరింత ఆదరణ పెరగాలి

● రాష్ట్రస్థాయి జూనియర్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం స్పోర్ట్స్: జిల్లాలో క్రీడలకు మరింత ఆదరణ పెరగాలని, ప్రోత్సహించేందుకు దాతలు ముందుకు రావాలని ఎమ్మెల్యే గొండు శంకర్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరరావు పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఇండోర్ స్టేడియంలో జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ప్రారంభోత్సవంలో వారు పాల్గొని మాట్లాడారు. జిల్లాలో కరణం మల్లేశ్వరి, నీలంశెట్టి లక్ష్మి, పూజారి శైలజ వంటి క్రీడా దిగ్గజాలు జిల్లాకు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చారని గుర్తు చేశారు. సంఘ జిల్లా అధ్యక్షుడు కె.సాగర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు డాక్టర్ గూడేన సోమేశ్వరరావు, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు మెండ దాసునాయుడు, ఏపీబీఏ చైర్మన్ చుక్కా శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.అంకమ్మ చౌదరి, జిల్లా చైర్మన్ ఆర్.రాజేంద్రన్, కార్యదర్శి మెట్ట అశోక్‌కుమార్, సీఈవో సంపతిరావు సూరిబాబు, ఉపాధ్యక్షులు ఎంఎం విలేఖరి, ఎం.రత్నాజీ, జి.ప్రసాద్, జిల్లా ఒలింపిక్ సంఘ సలహాదారు పి.సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధిలో వరం కృషి స్ఫూర్తిదాయకం

అరసవల్లి: సిక్కోలు నగరం అభివృద్ధిలో అంధవరపు వరహానర సింహం (వరం) అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. వరం జయంతిని పురస్కరించుకుని నగరంలోని వరం హైస్కూల్, ఏడురోడ్ల కూడలిలోని ఆయన విగ్రహాలకు పూలమాల వేసి శంకర్ నివాళులర్పించారు. అనంతరం ఏడురోడ్ల జంక్షన్‌లో నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మనం సమాజానికి చేసిన సేవలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. కళింగకోమటి జాతికి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన మహనీయుడన్నారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు చిరు వ్యాపారులకు 15 తోపుడు బండ్లను అందజేశారు. అలాగే అన్నా క్యాంటీన్‌కు రూ.3లక్షల విరాళాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి, కళింగ కోమటి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోయిన గోవిందరాజులు, కూటమి నాయకులు మాదారపు వెంకటేష్, అంబటి లక్ష్మీరాజ్యం, పాండ్రంకి శంకర్, పీవీ రమణ, కొర్ను నాగార్జున ప్రతాప్, మెండ దాసునాయుడు, కోరాడ సర్వేశ్వరరావు, పైడి వేణుగోపాలం, వరం కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన నాటిక


నాటికలోని ఓ సన్నివేశం

శ్రీకాకుళం కల్చరల్: లలిత కళాసమితి ఆధ్వర్యంలో ఎల్.రామలింగస్వామి దర్శకత్వంలో కంచర్ల సూర్యప్రకాశరావు రచించిన మతమా.. మానవత్వమా నాటికను బుధవారం బాపూజీ కళామందిర్‌లో ప్రదర్శించారు. ఈ నాటిక ఆహూతలను ఆలోచింపజేసింది. ఈ నాటికలో రామశర్మగా ఆర్.బోసుబాబు, అన్నపూర్ణగా కె.రాజేశ్వరి, వెంకటశాస్త్రిగా గుత్తి రవిబాబు, రెహమాన్‌గా ప్రసాద్ రౌలో, అబ్రహాంగా బొడ్డేపల్లి లక్ష్మణరావు, డాక్టర్‌గా కామేశ్వరరావు నటించి ఆకట్టుకున్నారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు

జి.సిగడాం: సీజనల్ వ్యాధులపై అప్రమత్తమయ్యేలా చర్యలు తీసుకున్నట్టు వైద్యాధికారులు ప్రతిష్టాశర్మ, అనూష అన్నారు. బుధవారం బాతువలో సర్పంచ్ డబ్బాడ కల్యాణి ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. అలాగే సీజన్ వ్యాదులు, విష జ్వరాలు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఇంటింటికీ వెళ్లి వ్యాధులు, జ్వరాలపై ఆరా తీశారు.

సంపద కేంద్రాలు సిద్ధం చేయాలి

కంచిలి: మండలంలోని చెత్తనుంచి సంపద కేంద్రాలను అక్టోబరు రెండో తేదీ నాటికి వినియోగంలోకి తెచ్చేలా సిద్ధం చేయాలని ఎంపీడీవో వి.నీరజ తెలిపారు. మండల పరిధిలోని పలు చెత్త నుంచి సంపద కేంద్రాలను ఆమె పరిశీలించారు. కార్యదర్శులు వినోద్ కుమార్, చైతన్య, సర్పంచ్ సుమన్ పాల్గొన్నారు.

నేడు కేంద్రమంత్రి రాక

అరసవల్లి: కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు గురువారం జిల్లాలో పర్యటించనున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం ఉదయం న్యూఢిల్లీలో బయలుదేరి విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుని, అక్కడ నుంచి రోడ్డు మార్గం ద్వారా ఉదయం 10.30 గంటలకు శ్రీకాకుళం అంబేడ్కర్ ఆడిటోరియానికి చేరుకుంటారన్నారు. అక్కడ నిర్వహించే గురు పూజోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొంటారని, అనంతరం తన నివాసానికి చేరుకుంటారని పేర్కొన్నారు.

ఏజెన్సీ మార్పు వల్లే రవాణా చార్జీల చెల్లింపుల్లో జాప్యం

ఎచ్చెర్ల/శ్రీకాకుళం క్రైం: ఏపీ బేవరేజస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎచ్చెర్లలోని బాట్లింగ్ డిపో నుంచి మద్యం సరఫరా చేసే ట్రక్కు డ్రైవర్లకు రవాణా చార్జీల చెల్లింపుల్లో జాప్యానికి ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ మార్పే కారణమని ఐఎంఎల్ డిపో మేనేజర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.సుబ్బారావు అన్నారు. ఆయన బుధవారం విలేఖరులతో మాట్లాడారు. రవాణా చార్జీలను తప్పనిసరిగా చెల్లిస్తామన్నారు. చార్జీల చెల్లింపుతో సంబంధం లేనప్పటికీ, సంబంధిత ఏజెన్సీతో మాట్లాడి చెల్లింపులకు చర్యలు చేపడతామన్నారు. గత ప్రభుత్వంలో తిరుపతికి చెందిన థర్డ్ ఐ ఫెసిలిటేటర్ లిమిటెడ్ సంస్థ ద్వారా ఔట్ సోర్సింగ్ విధానంలో వైన్ షాపుల్లో సూపర్‌వైజర్లు, సేల్స్ మేన్స్ నియామకం జరిగిందని, దీని ఒప్పందం గడువు ఈ ఏడాది జూలైతో పూర్తయిందన్నారు. ఔట్ సోర్సింగ్ విధానంలో నియమితులైన ఈ సిబ్బంది ఇచ్చిన సమ్మె నోటీసు విషయాన్ని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కమిషనర్ దృష్టికి వెళ్లామన్నారు. ఈ విధానంలో నియమితులైన సిబ్బందికి సమ్మె చేసే హక్కు ఉండదన్నారు. సమ్మె వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని, సామరస్యంగా సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. మద్యం ప్రియులు ఎలాంటి బ్రాండ్ల మద్యం కోరుకుంటున్నారన్న వివరాలను ప్రభుత్వానికి పంపించామన్నారు. 2019కు ముందున్న బ్రాండ్లను నూతన ఎక్సైజ్ పాలసీలో తీసుకువచ్చే అవకాశం ఉందన్నారు. తక్కువ ధరకే నాణ్యమైన మద్యం అందజేస్తామన్నారు. సెబ్‌ను ఎక్సైజ్ శాఖలో విలీనంతో జిల్లాలో 12 పోలీస్ స్టేషన్‌ల పరిధిలో 230 సిబ్బంది విలీనమవుతారని చెప్పారు. మద్యం షాపుల్లో పనిచేస్తున్న సూపర్ వైజర్లు, సేల్స్‌మేన్‌లు ఈ నెల7వ తేదీన సమ్మె చేస్తామని నోటీసు ఇచ్చి.. వాయిదా వేసుకున్నారన్నారు.

పింఛన్ల బదిలీకి గ్రీన్‌సిగ్నల్‌పై హర్షం

రణస్థలం: రాష్ట్ర ప్రభుత్వం సామాజిక పింఛన్‌దారులకు గుడ్ న్యూస్ చెప్పింది. ఇక మీదట రాష్ట్రంలో ఎక్కడ నుంచైనా పింఛన్ తీసుకోవచ్చు. పింఛన్ పోర్టుబులిటీ విధానాన్ని ప్రవేశపెట్టింది. పింఛన్ బదిలీకి అవకాశమిస్తామని చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. ప్రస్తుతం పింఛన్ బదిలీ చేయాలనుకుంటున్నవారు ఎక్కడ పింఛన్ తీసుకుంటున్నారో ఆ సచివాలయానికి వెళ్లి బదిలీ చేసుకోవచ్చు. దరఖాస్తుతో పాటు పింఛన్ ఐడీ, ఏ ప్రాంతంలో తీసుకోవాలని అనుకుంటున్నారో ఆ జిల్లా, మండలం, పేరు నమోదు చేయాలి. ఇందుకు ఆధార్ జెరాక్స్ పొందుపరిస్తే సరిపోతుంది. సామాజిక పింఛన్ వెబ్‌సైట్‌లో ప్రస్తుతం ఆప్షన్ ఓపెన్ అయింది. స్వగ్రామాలకు రాలేనటువంటి వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ఆప్షన్ ప్రతినెలా అందుబాటులో ఉండనుంది. జిల్లాలో మొత్తం 14 విభాగాలకు చెందిన 3.21 లక్షల మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. వీరందరికీ తొలిరోజు అందించాలన్న లక్ష్యంతోనే పోర్టుబులిటీ విధానాన్ని అందుబాటులోకి తెచ్చినట్టు తెలుస్తోంది. వివిధ కారణాలతో సుదూర ప్రాంతాల్లో ఉన్నవారికి ఈ నిర్ణయం ఎంతగానో ఉపకరిస్తుంది. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. ప్రభుత్వ నిర్ణయంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు, రేపు విద్యుత్‌కు అంతరాయం

ఇచ్ఛాపురం: విద్యుత్ లైన్లు మరమ్మతు పనులు, కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నందున గురు, శుక్రవారాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ గోవిందరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ నిలిపి వేస్తున్నట్టు తెలిపారు. మున్సిపాల్టీ పరిధిలోని ఏఎస్‌పేట, పురుషోత్తపురం వార్డులతో పాటు మండలంలో గల ముచ్చింద్ర, కేదారిపురం పంచాయతీల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని తెలిపారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

కంచిలి: ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటడం ద్వారానే పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని ఏపీవో ధనుంజయం అన్నారు. కంచిలిలోని గురుకుల పాఠశాలలో బుధవారం న్యూట్రిషన్ డే సందర్భంగా ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేడు వస్తున్న ప్రకృతి ఉపద్రవాలన్నీ అధిక ఉష్ణోగ్రతల వల్లే అన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పాఠశాల ఆవరణలో 50 మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ గణపతి, ఫీల్డ్ అసిస్టెంట్ గిరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనుమతి లేకుంటే చర్యలు

సరుబుజ్జిలి: వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న వినాయక చవితి మండపాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని, లేకపోతే చర్యలు తప్పవని ఎస్ఐ బి.నిహార్ హెచ్చరించారు. బుధవారం ఆయన మండలంలో పలు గ్రామాల్లో విద్యుత్, అగ్నిమాపకశాఖ అధికారులతో కలిసి పర్యటించారు. గణేష్ మండపాలు ఏర్పాటు చేస్తున్న కమిటీ పెద్దలతో మాట్లాడారు. రొట్టవలసలో ఏర్పాటు చేసిన రెండు గణేష్ మండపాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. పోలీస్ సిబ్బందితో పాటు విద్యుత్ ఏఈ పీవీ అప్పలనాయుడు, ఆమదాలవలస అగ్నిమాపక శాఖ అధికారి చక్రధరరావు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

ఇచ్ఛాపురం: నిబంధనలు తప్పని సరిగా పాటించాలని ఆర్డీవో భరత్‌నాయక్ అన్నారు. బుధవారం మున్సిపాల్టీ, మండల పరిధిలో గల పలు థియేటర్లను పరిశీలించారు. సినిమా హాల్స్‌లో పరిశుభ్రత పాటించాలని, మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే థియేటర్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. తహసీల్దార్ వెంకటరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నమోదు వేగవంతం చేయాలి

ఇచ్ఛాపురం: ఈ-పంట నమోదు వేగవంతం చేయాలని తహసీల్దార్ వెంకటరావు సబంధిత అధికారులకు సూచించారు. బుధవారం కార్యాలయంలో వీఆర్‌వోలు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్స్‌తో సమీక్షించారు. ఈ నెలాఖరిలోగా పంట నమోదు శతశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. వ్యవసాయశాఖ అధికారిణి ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

రణస్థలం: ఇటీవల కురిసిన వర్షాలకు వరి పంటకు ఆకుముడత తెగులు సోకిందని రైతులు అప్రమత్తం కావాలని ఏవో భాస్కరరావు అన్నారు. బుధవారం తిరుపతిపాలెంలో రైతులు సాగుచేస్తున్న వరి పంటను పరిశీలించారు. రైతులు ఒక తాడు పట్టుకొని వరిపైనలాగితే ఆకు చివరిలో ఉన్న గుడ్లు, పురుగులు పోతాయన్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు.